తెలంగాణ జాతీయ దినపత్రిక

సంపుటి : 4

సంచిక : 18

పేజీలు - 8

వెల- రూ 5:00

prajamantalu.com

# ప్రజా మంటలు

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

మంగళవారం 06, జూన్ 2023

Published From Jagithyal, Circulated to Jagtial, Jangaon,Jayashankar Bhoopalpally, Jogulamba Gadwal, Kamareddy, Karimnagar, Khammam, Komaram Bheem Asifabad, Mahabubabad, Mahabubnagar, Mancherial, Medak, Medchal, Nagarkurnool, Nalgonda, Nirmal, Nizamabad, Peddapalli, Rajanna Sircilla,Rangareddy, Sangareddy, Siddipet, Suryapet, Vikarabad, Wanaparthy, Warangal (Rural), Warangal (Urban), Yadadri Bhuvanagiri


## రైల్వే శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

- దేశ వ్యాప్తంగా రైల్వే శాఖలో 3.12 లక్షల ఉద్యోగాల ఖాళీలు
- సౌత్ సెంట్రల్ రైల్వే లోనే 30 వేల ఉద్యోగాల ఖాళీలు
- ఉద్యోగ ఖాళీలతో పెరుగుతున్న పని ఒత్తిడి
- ఉద్యోగ ఖాళీల వల్ల పర్యవేక్షణ లోపించి ప్రమాదాలు, అనర్థాలకు దారి తీస్తోంది
- రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌కు వినోద్ కుమార్ లేఖ



**హైదరాబాద్ జూన్ 05 (ప్రజా మంటలు):** రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్ కుమార్ కేంద్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ మేరకు కేంద్ర రైల్వే శాఖ

మిగతా... 2లో



## తొలగిన అడ్డంకులు

- గ్రూప్ 1 పరీక్షకు తొలగిన అడ్డంకులు
- పరీక్ష నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్
- 11న పరీక్ష నిర్వహణకు అధికారుల సన్నాహాలు
- ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష

**హైదరాబాద్,జూన్5(ప్రజా మంటలు):** తెలంగాణలో గ్రూప్ 1 పరీక్షలకు అడ్డంకులు తొలిగాయి. పరీక్ష నిర్వహణకు హైకోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. టీఎస్ పీఎస్సీ పేపర్ లీకేజీలపై విచారణ కొనసాగుతుందని.. ఈ సమయం లో పరీక్ష ఎలా నిర్వహిస్తారంటూ కొందరు కోర్టులో పిటీషన్లు దాఖలు చేశారు. వీటిపై సోమవారం విచారించిన హైకోర్టు.. గ్రూప్ 1 పరీక్ష నిర్వహణకు అభ్యంతరం లేదని.. నిర్వహించాలని ఆదేశాలు జారీ చేసింది. అభ్యర్థులు పరీక్ష రాసేందుకు సిద్ధంగా ఉన్నారని.. ఇప్పటికే లక్షా 20 వేల మంది హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకున్నారన్న ప్రభుత్వ వాదనతో హైకోర్టు ఏకీభవించింది. గ్రూప్ 1 పరీక్షను టీఎస్ పీఎస్సీ పరిధిలో నిర్వహించకూడదని పిటీషనర్లు వాదించారు. పేపర్ లీకేజీ దర్యాప్తు కొనసాగుతుందని.. ఏ కమిషన్ లో అయితే పేపర్లు లీక్ అయ్యాయో.. అదే కమిషన్.. విచారణ పూర్తి కాకుండానే గ్రూప్ 1 పరీక్ష ఎలా నిర్వహిస్తుందని ప్రశ్నించారు. 11 సంవత్సరాల తర్వాత జరుగుతున్న గ్రూప్ 1 పరీక్ష అని.. పారదర్శకత లేకపోతే అభ్యర్థులు తీవ్రంగా నష్టపోతారని పిటీషనర్ల తరపు లాయర్లు వాదించారు. పేపర్లు లీక్ అయిన పరీక్షలను మళ్లీ నిర్వహించకుండా.. హడావిడిగా గ్రూప్ 1 ఎందుకు నిర్వహిస్తున్నారంటూ పిటీషనర్ల తరపు లాయర్లు కోర్టు దృష్టికి తీసుకొచ్చారు. విచారణ పూర్తయ్యే వరకు గ్రూప్ 1 పరీక్ష నిర్వహించకూడదని వాదించారు. ఈ వాదనను హైకోర్టు పరిగణలోకి తీసుకోలేదు. నిందితులను

మిగతా... 2లో

### భారాసా మానవ వనరుల కేంద్రానికి..

# సీఎం కేసీఆర్ భూమి పూజ

- బిఆర్ఎస్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ భవన్
- కోకాపేటలో అత్యాధునిక భవన నిర్మాణం
- శంకుస్థాపన చేసిన సీఎం కెసిఆర్

**హైదరాబాద్,జూన్6(ప్రజా మంటలు):** భారత రాష్ట్రసమితి మరో అడుగు ముందుకు వేసింది. పార్టీ శ్రేణులకు శిక్షణ ఇచ్చేలా అత్యాధునిక భవనం ఆవిర్భావం కాబోతున్నది. దేశంలోని మరే రాజకీయ పార్టీకి లేని విధంగా అత్యాధునిక సాంకేతిక హంగులతో ఏర్పాటుచేస్తున్న భారత్ భవన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ కేంద్రానికి ముఖ్యమంత్రి కేసీఆర్ శంకుస్థాపన చేశారు. హైదరాబాద్ శివార్లలోని కోకాపేటలో 11 ఎకరాల విస్తీర్ణంలో 15 అంతస్థుల్లో నిర్మిస్తున్న భారీ భవన నిర్మాణ పనులకు సీఎం కేసీఆర్ భూమిపూజ చేశారు. చండీహోమం, పూర్ణాహుతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు కే కేశవరావు, వద్దిరాజు రవిచంద్ర, నామా నాగేశ్వరరావు, బీబీ పాటిల్, దామోదర్ రావు, సురేశ్ రెడ్డి, రంజిత్ రెడ్డి, పసునూరి దయాకర్, మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, మల్లారెడ్డి, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, శంభీపూర్ రాజు, మధుసూదనా చారి, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కాలె యాదయ్య,

మిగతా... 2లో





## పర్యావరణహితంగా విశ్వనగరంగా హైదరాబాద్

- ప్రజల భాగస్వామ్యంతోనే ఇది సాధ్యం
- నాలాల్లో ఇష్టం వచ్చినట్లుగా వ్యర్థాలు
- పర్యావరణ దినోత్సవం సందర్భంగా కెటిఆర్

**హైదరాబాద్,జూన్6(ప్రజా మంటలు):** హైదరాబాద్ నగరం విశ్వనగరంగా మారాలన్న, బాగుపడాలన్నా పౌరుల భాగస్వామ్యం తప్పనిసరి అని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా ఏమీ చేయలేమని అన్నారు. ప్రజలు ఇది తమ నగరం అని గుర్తించి ముందుకు సాగాలన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఖైరతాబాద్‌లోని అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలో ఏర్పాటు చేసిన సమావేశంలో కేటీఆర్ పాల్గొని

మిగతా... 2లో



### 23న పాట్నాలో

## విపక్షాల భేటీ

- రాహుల్ లేకపోవడంతో తేదీ మార్పు
- 12 నుంచి 23కు మార్చిన నితీశ్

**న్యూఢిల్లీ,జూన్6(ప్రజా మంటలు):** జూన్ 12న పాట్నాలో జరగాల్సిన ప్రతిపక్ష పార్టీల సమావేశం జూన్ 23కు వాయిదా పడింది. కాంగ్రెస్, తమిళ నాడు మిత్రపక్షం అభ్యర్థన మేరకు తేదీని మార్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. కాంగ్రెస్ అభ్యర్థి రాహుల్ గాంధీ గైర్హాజరీని దృష్టిలో ఉంచుకుని ఈ మార్పు చేసినట్లు తెలుస్తోంది. రాహుల్ గాంధీ ప్రస్తుతం జాలో ఆరు రోజుల పర్యటనలో ఉన్నారు. ఆయన జూన్ 15 న తిరిగి వస్తారని సమాచారం. అతని తల్లి సోనియా గాంధీ కూడా

మిగతా... 2లో

### విద్యుత్ రంగంలో

# విప్లవాత్మక విజయాలు

### -ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్రావు

**మెటుపల్లి, జూన్, 05 (ప్రజామంటలు):** తెలంగాణ ప్రభుత్వం విద్యుత్ రంగంలో విప్లవాత్మక విజయాలు సాధించాయని స్థానిక ఎమ్మెల్యే విద్యాసాగర్ రావు అన్నారు. సోమవారం మెట్పల్లి మండలంలోని వెల్లుల్ల శివారులో గల కేఎన్రెడ్డి గార్డెన్స్లో తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కోరుట్ల నియోకవర్గ స్థాయి విద్యుత్ విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్ రంగంలో తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక విజయాలు సాధించిందని అన్ని రంగాలకు నిరంతరాయంగా 24 గంటలు విద్యుత్ను ఇస్తూ వ్యవసాయ రంగానికి ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ కీర్తి దేశం నలుదిశల వ్యాపించిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత కొతల్లేని నిరంతర విద్యుత్. కోసం కొరుట్ల నియోజకవర్గంలో

మిగతా... 2లో



### ఐటి రంగంలో తెలంగాణ

# దూకుడు

- లక్ష 83 వేల కోట్లకు చేరుకున్న ఐటీ ఎగుమతులు
- వార్షిక నివేదికను విడుదల చేసిన మంత్రి కెటిఆర్

**హైదరాబాద్,జూన్6(ప్రజా మంటలు):** ఐటీ రంగంలో హైదరాబాద్ నగరం దూసుకుపోతోందని, ఈ రంగంలో ఎంతో పురోగతి సాధించామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. టీ హబ్‌లో ఐటీ శాఖ 9వ వార్షిక నివేదికను మంత్రి కేటీఆర్



విడుదల చేశారు. సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. 2013-14లో హైదరాబాద్‌లో ఐటీ ఉత్పత్తులు రూ. 56 వేలు కోట్లు ఉంటే.. అంచెలంచెలుగా ఎదుగుతూ ఇవాళ ఒక లక్ష 83 వేల కోట్ల ఐటీ ఎగుమతులకు చేరుకున్నామని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన సమయంలో ఐటీ సెక్టార్‌లో 3 లక్షల 20 వేల ఉద్యోగాలు ఉంటే.. ఇప్పుడు 7 లక్షలకు పైచిలుకు ఉద్యోగాలు కల్పించామని గుర్తు చేశారు. ఐటీ రంగంలో బెంగళూరుతో పోటీ పడేలా హైదరాబాద్‌ను నిలబెట్టామని చెప్పారు. కరోనా వచ్చాక ఐటీ రంగంపై అనేక అపోహాలు వచ్చాయి. ఐటీ రంగంలో కేంద్రం నుంచి సహకారం ఏమీ లేదు. మాట సాయం తప్ప కేంద్రం ఎలాంటి అండదండలు అందించలేదు. యూపీఏ ప్రభుత్వం తెలంగాణకు కేటాయిచిన ఐటీఐఆర్‌ను కూడా ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం రద్దు చేసింది. అయినప్పటికీ

మిగతా... 2లో

## ప్రజానాడి







## రెజ్లర్లకు దక్కని ఊరట

- స్పష్టమైన హామీని ఇవ్వలేకపోయిన అమిత్ షా
- ఆందోళనను విరమించే దిశగా రెజర్ల చర్య
- ఉద్యమం నుంచి వెనక్కి తప్పకున్న సాక్షిమాలిక్

**న్యూఢిల్లీ,జూన్6(ప్రజా మంటలు):** హోంమంత్రి అమిత్ షాను కలిసిన రెజ్లర్లకు నిరాశే మిగిలింది. వారికి అనుకూలంగా ఎలాంటి హామీ దక్కలేదు. ఇదే విషయాన్ని సోమవారం రెజ్లర్లు వెల్లడించారు. రెజ్లింగ్ చీఫ్ బ్రిజ్ భూషణ్‌సింగ్ వ్యవహరించిన తీరుకు వ్యతిరేకంగా నిరసనలు చేస్తున్న భారత రెజ్లర్లు హోంమంత్రి అమిత్‌షాను కలిశారు. రాత్రి 11 గంటలకు ఢిల్లీలోని ఆయన ఇంట్లో హోంమంత్రిని కలిసిన రెజ్లర్లు దాదాపు గంటపాటు సమావేశమయ్యారు.

మిగతా... 2లో



### రైతుల ముసుగులో

## రాజకీయాలు

- ధాన్యం పోయాల్సింది కళ్లాల దగ్గర తప్ప..
- క్యాంపు కార్యాలయం ముందు కాదు.
- ధాన్యం కొనుగోలు చేస్తున్న ప్రభుత్వంపై విమర్శలా.?
- మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎదురు ప్రశ్న

**ధర్మపురి జూన్ 05 (ప్రజా మంటలు):** రైతుల ముసుగులో కొందరు రాజకీయాలు చేస్తున్నారని రాష్ట్ర ఎస్సీ అభివృద్ధి సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రగతి దినోత్సవం కార్యక్రమంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ పాల్గొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తున్నప్పటికీ ధర్మపురిలో తాను బస చేసిన క్యాంపు

మిగతా... 2లో




## పర్యావరణహితంగా విశ్వనగరంగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి..
ప్రసంగించారు. అందరికీ ప్రపంచ పర్యావరణ దినోత్సవ శుభాకాంక్షలు. ఈ ఆవరణలోని చెట్ల వల్ల ఎండాకాలంలో కూడా చల్లగా ఉంది. ఏసీ ఆడిటోరియం కంటే కూడా బాగుంది అని కేటీఆర్ పేర్కొన్నారు. మన నగరం జీవన ప్రమాణాలలో నివాసయోగ్యంగా ఉంది. ఇంకా నగరం అభివృద్ధి చెందడానికి జరగాల్సిన పని కూడా చాలా ఉంది. సరిగ్గా 9 ఏండ్ల కింద ఏర్పాటైన తెలంగాణలో నగరం, నాయకత్వం, మౌలిక వసతుల గురించి ఎన్నో అపోహలు, అనుమానాలు ఉండేవి. కానీ ఇవాళ 10వ వసంతంలో అడుగుపెడుతున్న సందర్భంగా ఎక్కడ ఏ ర్యాంకింగ్ తీసుకున్నా.. ప్రతి దాంట్లో అగ్రభాగాన నిలుస్తూ దేశానికే దిక్సూచిగా మారింది. సెంటర్ ఫర్ సైన్స్ ఎన్విరాన్‌మెంట్ నివేదికలో పర్యావరణ పరిరక్షణకు సంబంధించి విడుదల చేసిన తాజా బుక్‌లో తెలంగాణ అగ్రభాగాన నిలిచింది. మిగతా రాష్ట్రాలతో పోల్చితే చాలా ముందు వరుసలో ఉన్నాం. ఇది రాష్ట్రానికి గౌరవ కారణం. సాగునీరు, తాగునీరు, అటవీ సంపద, పంచాయతీ రాజ్, పట్టణాభివృద్ధి, పరిశ్రమల్లో తనదైన ముద్ర వేస్తున్నారు కేసీఆర్. ఏ రంగాన్ని కూడా కేసీఆర్ ఉపేక్షించలేదు. అన్ని రంగాల్లో హైదరాబాద్, తెలంగాణ అగ్రభాగాన ఉంటున్నాయని కేటీఆర్ స్పష్టం చేశారు. దేశంలోనే హైదరాబాద్ ఉత్తమ నగరంగా ఉందని పలు నివేదికలు వెల్లడించాయని కేటీఆర్ గుర్తు చేశారు. ఇతర నగరాలతో పోల్చితే హైదరాబాద్ బాగానే ఉంది. ప్రపంచంతో పోల్చితే విశ్వనగరం కావాలంటే చాలా మైళ్ల దూరం ప్రయాణించాల్సి ఉంది. స్పష్టమైన ఎజెండా, దక్షత గల నాయకత్వం, అన్నింటికి మించి ఇతరులతో కలిసి పని చేసే మనస్తత్వం ఉండాలి. ఒక వ్యక్తి, సంస్థ గానీ సర్వం నాకే తెలుసు. ప్రపంచం మొత్తం నాకే తెలుసు అనుకుంటే ఎక్కడికి పోలేవు అని కేటీఆర్ పేర్కొన్నారు. మాన్‌సూన్‌కు సంబంధించి చాలా పనులను పర్యవేక్షిస్తున్నాం అని కేటీఆర్ తెలిపారు. నాలాలను క్లీనింగ్ చేసేటప్పుడు.. పూడికలో వచ్చే కొన్నింటిని చూస్తుంటే ఆశ్చర్యం వేస్తుంది. సోఫాలు, దిండ్లు, ఇతరత్రా వస్తువులు అనేకం బయటపడుతున్నాయి. సూపర్ మార్కెట్లో కూడా దొరుకుతాయో లేదో కానీ నాలాలో అన్నీ దొరుకుతాయి. పనికిరాని వస్తువులను నాలాల్లో ఎందుకు వేస్తున్నారో అర్థం కావడం లేదు. ఎందుకింత అనాగరికంగా ఆలోచిస్తున్నామో అర్థం కాదు. నాగరిక సమాజంలో బతకాలనే వారు ఇలా చేయరు. ఇల్లు మాత్రమే నాది.. నాలా నాది కాదు అనే భావనతో బతకొద్దు అని కేటీఆర్ సూచించారు. మార్పు రానంత వరకు ఎన్ని డబ్బులు ఖర్చు పెట్టినప్పటికీ ప్రయోజనం ఉండదన్నారు. నగరం బాగుపడాలంటే పౌరుల భాగస్వామ్యం తప్పకుండా అవసరం అని కేటీఆర్ స్పష్టం చేశారు. అందరం కలిసి కదిలితేనే మార్పు వస్తుంది. నాగరికంగా బతికే అవకాశం కలుగుతుంది. అనాగరిక లక్షణాలు సమాజంలో అనేకం ఉన్నాయి. భారతదేశంలో ఎక్కడా లేని విధంగా పది శాతం బడ్జెట్‌ను పచ్చదనానికి కేటాయించారు. చెట్లను నాటి కాపాడాలని కేసీఆర్ ఆదేశించారు. లేదంటే సర్పంచ్, కౌన్సిలర్ ఉద్యోగం పోతుందని చెప్పిన మొట్టమొదటి ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రమే. రతి గ్రామంలో ఒక నర్సరీ, ట్రాక్టర్, ట్యాంకర్ ను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ సదుపాయం ఇతర రాష్ట్రాల్లో లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు.

## 23న పాట్నాలో విపక్షాల భేటీ

మొదటిపేజీ తరువాయి..
ఆరోగ్యకారణాల రీత్యా విదేశాల్లో ఉన్నారు. ఆమెతో పాటు ప్రియాంక గాంధీ వాద్రా కూడా ఉన్నారు. డీఎంకే కూడా సమావేశాన్ని వాయిదా వేయాలని కోరినట్టు సమాచారం. జూన్ 12వ తేదీనే రాష్ట్రంలో ఓ ప్రభుత్వ కార్యక్రమం ఉన్నది. ఆ కార్యక్రమానికి సీఎం ఎంకే స్టాలిన్ హాజరు కావాల్సి ఉంది. 2024లో బీజేపీని ఢీకొట్టేందుకు విపక్షాలను ఒకే గొడుగు కిందకు తీసుకురావడానికి ముందుకొచ్చిన బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ చొరవతో పాట్నాలో సమావేశం జరగనుంది. గత నెలలో రాహుల్ గాంధీ, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున్ ఖర్గేతో భేటీ అనంతరం జూన్ 12న సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. ఇదిలావుంటే ఇప్పుడు రాజకీయాల్లో రాహుల్ చురుకుగా వ్యవహరించాలని చూస్తున్నారు. ఎన్నికల తర్వాత తెలంగాణలో చూద్దామన్నా బీజేపీ ఉండదని.. ఇతర రాష్ట్రాల్లోనూ ఆ పార్టీని మట్టికరిపిస్తామని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ అన్నారు. ఆ తర్వాత 2024 సాధారణ ఎన్నికల్లో దేశవ్యాప్తంగానూ బీజేపీని ఓడిస్తామని చెప్పారు. 'బీజేపీ విద్వేష భావజాలంతో ముందుకెళ్లలేమని ప్రజలు గుర్తించారు. ఆయా రాష్ట్రల వారు ఇప్పటికే ఆ పార్టీని ఓడించాలని, కాషాయదళ రాజకీయాలను తిప్పికొట్టాలని నిర్ణయించుకున్నారు. ప్రతిపక్షం ఏకమైంది. మేమంతా కలిసి పనిచేస్తున్నాం. ఓవైపు విద్వేష, విభజనవాద బీజేపీ.. మరోవైపు ఆప్యాయత, ప్రేమపూరిత కాంగ్రెస్. ఇదో భావజాల సమరం'అని రాహుల్ అన్నారు.

అమెరికా పర్యటనలో ఆయన న్యూయార్క్‌లో ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ ఏర్పాటు చేసిన డిన్నర్ సమావేశంలో ప్రసంగించారు. సమావేశ సమన్వయ బాధ్యతను టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పర్యవేక్షించారు. ఈ సమావేశంలో రాహుల్ ప్రసంగిస్తూ.. 'దర్యాప్తు సంస్థలు, అధికారం, మీడియా అండతో కర్ణాటకలో అక్రమ మార్గాల్లో గెలవడానికి ఏం చేయాలో బీజేపీ అన్నీ చేసింది. మా కంటే పదిరెట్లు అధిక ధనం వారి దగ్గరుంది. అయినా వారిని ఓడించగలమని రుజువు చేశాం. ఓడించడం కాదు.. తుడిచిపెట్టేశాం' అని రాహుల్ వ్యాఖ్యానిం చారు. కర్ణాటక తరహాలోనే తెలంగాణతో పాటు త్వరలో ఎన్నికలు జరు గనున్న రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో బీజేపీని తుదముట్టించ నున్నట్లు రాహుల్ పేర్కొన్నారు.

అలాగే ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ స్పందించారు. ప్రస్తుతం ఆమెరికా పర్యటనలో ఉన్న ఆయన.. న్యూయార్క్‌లో భారతీయ ప్రవాసులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఒడిశా రైలు ప్రమాదంపై మాట్లాడిన రాహుల్ .. ఈ రైలు ప్రమాదం ఎందుకు జరిగిందని బీజేపీ నేతలను అడగండి వారు 50 సంవత్సరాల క్రితం కాంగ్రెస్ ఇలాగే చేసిందని చెబుతారని అన్నారు. బీజేపీఎప్పుడూ గతాన్ని తిరిగి చూస్తుందని, నిందను దాటవేస్తుందని ఆరోపించారు.

బీజేపీ తన తప్పులను ఒప్పుకోకపోవడం అలవాటుగా మారిందన్న రాహుల్.. తప్పుల గురించి ప్రశ్నించినప్పుడు కాంగ్రెస్‌పై నిందలు మోపుతుందని చెప్పారు. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం వాస్తవాన్ని స్వీకరించలేక సాకులు చెబుతుందని విమర్శించారు. ఒడిశా రైలు ప్రమాదంలో మరణించిన వారికి 60 సెకన్ల పాటు రాహుల్ మౌనం పాటించారు.

### భారాసా మానవ వనరుల కేంద్రానికి..
# సీఎం కేసీఆర్ భూమి పూజ

మొదటిపేజీ తరువాయి..
పార్టీ నేతలు పాల్గొన్నారు. అప్పటికే దేశ రాజధాని ఢిల్లీలో పార్టీ కేంద్ర కార్యాలయాన్ని, వివిధ రాష్ట్రాల్లో పార్టీ కార్యాలయాలను ఏర్పాటు చేసుకున్న బీఆర్ఎస్.. హైదరాబాద్‌లో అత్యాధునిక సాంకేతిక హంగులతో మరో భారీ భవన నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. దేశంలోని మరే రాజకీయ పార్టీకి లేని విధంగా అన్ని హంగులతో అత్యాధునిక పరిశోధన, శిక్షణా సంస్థను ఏర్పాటుచేస్తున్నది. రాజకీయపరమైన అవగాహన కార్యక్రమాలు, శిక్షణా తరగతుల నిర్వహణ, కార్యకర్తలు, నాయకులకు అవసరమైన సమస్త, సమగ్రమైన సమాచారం లభించే కేంద్రంగా 'భారత్ భవన్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ అండ్ హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్' కేంద్రాన్ని నెలకొల్పనున్నది. మొత్తం 15 అంతస్థుల్లో భవనాన్ని నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు సమాచారం. పార్టీ కార్యకర్తలకు సమగ్ర శిక్షణా కేంద్రందేశంలోని ఏ ప్రాంతం వారు వచ్చినా సమస్త సమాచారం లభించేలా, పార్టీ కార్యకర్తలకు సమగ్రమైన శిక్షణ లభించే కేంద్రంగా దీనిని తీర్చిదిద్ద నున్నారు. పెద్ద పెద్ద సమావేశ మందిరాలు, అత్యాధునికమైన డిజిటల్ లైబ్రరీ, వివిధ భాషా పత్రికలు, వాటిలో వచ్చే వార్తల సమాచారాన్ని క్రోడీకరించడం, పార్టీ నేతలకు అవసరమైన సమాచారాన్ని అందించడం, రాష్ట్రాలవారీగా,



రంగాలవారీగా వివరాలను సమీకరించడం, వాటిని క్రోడీకరించడం వంటివి ఇక్కడ చేయనున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న పార్టీ కార్యకర్తలకు ఇక్కడ శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన తరగతి గదులు, సమావేశ మందిరాలను ఏర్పాటు చేయనున్నారు. శిక్షణకు వచ్చేవారు బస చేసేందుకు అవసరమైన వసతి ఏర్పాట్లు కూడా ఉంటాయి. దేశంలోనే అత్యంత పేరున్న సంస్థల్లో పనిచేసిన కొందరు సీనియర్లను శిక్షణ, పరిశోధన కార్యక్రమాల కోసం నియమించనున్నారు. రిటైర్డ్ అధికారులు, న్యాయ నిపుణులు, రాజకీయ రంగంపై అవగాహన ఉన్నవారిని సమన్వయ కర్తలు, శిక్షకులు, సబ్జెక్ట్ నిపుణులుగా నియమించనున్నారు. శంకుస్థాపన కార్యక్రమానికి రావాల్సిందిగా పార్టీకి చెందిన పలువురు ముఖ్యనేతలు, మంత్రులు, హైదరాబాద్ నగర ఎమ్మెల్యేలకు ఆహ్వానాలు పంపించారు.

# రైతుల ముసుగులో రాజకీయాలు

(మొదటి పేజీ తరువాయి)
కార్యాలయం ఎదుట ధాన్యం పోయడం వెనుక రాజకీయ కోణం తప్ప మరొక్కటి లేదన్నారు. కమలాపూర్ లో 20 వేల క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేసిన ప్రభుత్వం కేవలం ఒక్క రైతుకు చెందిన ధాన్యం ఎందుకు కొనుగోలు చేయమని ప్రశ్నించారు. ధాన్యం పోయాల్సింది కళ్లాల దగ్గర తప్ప, రోడ్డు మీద పోస్తే రాజకీయం కాకపోతే..మరేంటీ అని మంత్రి అన్నారు. రైతు ముసుగు వేసుకొని రాజకీయం చేయాలనుకుంటే ఎప్పటికీ చెల్లదని, ఎవరైతే రైతు ముసుగులో రాజకీయం చేస్తున్న దొంగలను గుర్తించాలన్నారు. కరెంట్ కష్టాలు అందరూ అనుభవించారని, అలాంటి కష్టాలను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటుతో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ తొలగించారని మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు.
దశబ్దాల పాటు అధికారంలో కొనసాగిన పాలకులు ఎవరూ విద్యుత్ కష్టాలను తొలగించేందుకు కృషి చేయలేదని విమర్శించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాడే విద్యుత్ ప్రగతిపై దృష్టి సారించారన్నారు. కాంగ్రెస్, బీజేపీ నేతలు మాటలకే పరిమితం అయ్యారు తప్ప ప్రజలకు ఏది అవసరమో గుర్తించ లేకపోయారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కరెంట్ పరిస్థితి అస్తవ్యస్తంగా ఉండేదని, పగలు కరెంట్ ఎనాడు ఉండకపోయేదన్నారు. అలాంటి స్థితి నుంచి తెలంగాణ సాధించుకున్న అనతికాలంలోనే తెలంగాణను వెలుగులు తెలంగాణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని చెప్పారు.
రాష్ట్ర ప్రగతి పథంలో నడిపించాలన్న ఒక సదుద్దేశ్యంతో ఉచిత కరంట్ ను అమలు చేశారని గుర్తు చేశారు. అదే విధంగా రైతుల పంట సాగుకు పెట్టుబడి సాయ కింద రైతు బందును అమలు చేశారని. రైతు ప్రమాద వశాత్తు రైతు మరణిస్తే ఆ కుటుంబం వీధి పాలు కాకుడదని ముందు చూపుతో రైతుబీమాను ప్రవేశపెట్టారన్నారు. ఇన్ని మంచి పనులు చేస్తున్న ప్రభుత్వంపై తప్పుడు ప్రచారంతో ప్రజలను మభ్యపెట్టాలనుకున్న వారికి ప్రజలేతగిన సమాధానం చెప్పాలన్నారు.
ధర్మపురి నియోజకవర్గంలో ఉమ్మడి రాష్ట్రంలో ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా అదనపు కలెక్టర్ మంద మకరంద్, డీసీఎంఎస్ చైర్మన్ ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి, ధర్మపురి మున్సిపల్ చైర్మన్ సంగి సత్తెమ్మ, ఎంపీపీలు చిట్టి బాబు,కరుణశ్రీ, జెడ్పీటీసీ పద్మజ జితేందర్, మార్కెట్ చైర్మన్ రాజేష్, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ అదనపు గదులను ప్రారంభించిన ఎంపీ

**మహాదేవపూర్ జూన్ 05 (ప్రజా మంటలు):** మహాదేవపూర్ మండలంలోని కాళేశ్వరం గ్రామ పంచాయతీ అదనపు గదులను ప్రారంభించిన పెద్దపల్లి జిల్లా ఎంపీ బోర్లకుంట వెంకటేష్ నేత మంథని నియోజకవర్గ బి ఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధుకర్ భూపాలపల్లి జిల్లా పరిషత్ చైర్ పర్సన్ జక్కు శ్రీ హర్షిని, ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెన్నపురెడ్డి వసంత కాళేశ్వర ముక్తేశ్వర దేవస్థాన చైర్మన్ లింగంపల్లి శ్రీనివాసరావు మహాదేవపూర్ సర్పంచ్ శ్రీపతి బాపు ఎంపీపీ బి రాణి బాయ్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ పెండ్యాల మమత పలువురు బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఐటి రంగంలో తెలంగాణ దూకుడు

మొదటిపేజీ తరువాయి..
నిలదొక్కుకుని ఐటీ రంగాన్ని అగ్రభాగానా నిలబెట్టామని కేటీఆర్ తెలిపారు. ఐటీ రంగం దూసుకెళ్లేందుకు మా టీమ్ బాగా పని చేస్తోందని కేటీఆర్ ప్రశంసించారు. వాషింగ్టన్‌లో అనేక మంది పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యాను.
బెల్లంపల్లిలో పెట్టుబడులు పెట్టేందుకు రెండు వాషింగ్టన్ సంస్థలు ముందుకు వచ్చాయని తెలిపారు. అనేక అమెరికా కంపెనీలు హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతున్నాయని కేటీఆర్ తెలిపారు. అమెరికాకు చెందిన క్వాల్‌కామ్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతోంది. గూగుల్ కూడా హైదరాబాద్‌లో అతిపెద్ద కేంద్రం నిర్మిస్తోంది. భారత్ కంపెనీ ఎల్‌టీఐ మైండ్ ట్రీ కంపెనీ వరంగల్‌లో పెట్టుబడులు పెడుతోంది. గ్రిడ్ డైనమిక్స్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతోంది. సైబర్ నేరాలు అరికట్టేందుకు సైబర్ క్రైమ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ తెస్తున్నాం అని కేటీఆర్ వివరించారు. దరాబాద్‌లో పెట్టుబడి పెట్టేందుకు జర్మనీ కంపెనీ బాష్ ముందుకొచ్చిందని కేటీఆర్ తెలిపారు. మైక్రోసాఫ్ట్ డేటా సెంటర్ హైదరాబాద్‌కు వస్తోంది. లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్ కేంద్రం ఈ ఏడాది వస్తుంది. మరో రెండేళ్లలో డజోన్ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సెంటర్ వస్తోంది. అమెరికాకు చెందిన వార్నర్ బ్రదర్స్ డిస్కవరీ హైదరాబాద్‌లో ఐడీసీ నిర్మిస్తోంది. అమెరికాకు చెందిన జాప్‌కామ్ సెంటర్ కూడా హైదరాబాద్‌లో పెట్టుబడులు పెడుతోంది. టెక్నిప్ ఎఫ్ఎంసీ కంపెనీ సెంటర్ కూడా వస్తోందన్నారు కేటీఆర్.
రంగల్, మహబూబ్‌నగర్, నల్లగొండ, సిద్దిపేట, సిరిసిల్ల వంటి పట్టణాలకు కొత్త సంస్థలు వస్తున్నాయని కేటీఆర్ పేర్కొన్నారు. వరంగల్‌కు టెక్ మహీంద్రా, జెన్‌ప్యాక్ వంటి సంస్థలు వస్తున్నాయి. మహబూబ్ నగర్ లోనూ కొన్ని సంస్థలు తమ కార్యాలయాలను ఏర్పాటు చేసుకుంటున్నాయి. నల్లగొండ వంటి టైర్ 2 పట్టణాలకు పరిశ్రమలు వస్తున్నాయి. ఫాక్స్‌కాన్ సంస్థ లక్ష ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చింది. త్వరలోనే ఈ మొబిలిటీ వీక్ నిర్వహించబోతున్నాం. టీ వర్క్స్ సంస్థకు ఇటీవలే కేంద్రం అవార్డు ఇచ్చింది. టీ వర్క్స్ స్ఫూర్తితో మహారాష్ట్ర ఎం వర్క్స్ ఏర్పాటు చేయబోతుంది అని కేటీఆర్ తెలిపారు.

# తొలగిన అడ్డంకులు

మొదటిపేజీ తరువాయి..
ఇప్పటికే అరెస్ట్ చేశారు అని.. దర్యాప్తు తీరుపై కోర్టులు నిర్ణయం తీసుకుంటాయని.. అందులో భయపడాల్సిన అవసరం లేదంటూ.. పిటీషనర్లను ఉద్దేశించి వ్యాఖ్యలు చేసింది హైకోర్టు.

### 11వ తేదీ ఆదివారం గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష

గతంలో జరిగిన కొన్ని తప్పిదాల దృష్టిలో ఉంచుకుని గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహణకు టీఎస్పీఎస్సీ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 11వ తేదీ ఆదివారం పరీక్ష ఉదయం 10 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నారు. అయితే.. ప్రిలిమినరీ ఎగ్జామ్ ప్రారంభానికి 15 నిమిషాల ముందే గేట్ మూసివేస్తామని పబ్లిక్ సర్వీస్ కమిషన్ అభ్యర్థులకు స్పష్టం చేసింది. ఉదయం 10 గంటల 15 నిమిషాల తర్వాత అభ్యర్థులను ఎగ్జామ్ సెంటర్లలోకి అనుమతించేదని లేదని స్పష్టం చేసింది. ఇంకా ఓఎంఆర్ షీట్ ను నింపే విషయంలో చాలా అభ్యర్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించింది. ఓఎంఆర్ షీట్ నింపే సమయంలో ఏమైనా మిస్టేక్ చేస్తే కొత్తది ఇచ్చే ప్రసక్తే లేదని కమిషన్ స్పష్టం చేసింది. అభ్యర్థులు కేవలం బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్ తో మాత్రమే ఓఎంఆర్ షీట్లో ఆన్సర్లను బబ్లింగ్ చేయాలని కమిషన్ సూచించింది. పెన్సిల్, ఇంక్ పెన్, జెల్ పెన్లతో బబ్లింగ్ చేస్తే ఆ ఓఎంఆర్ షీట్లు చెల్లవని స్పష్టం చేసింది. డబుల్ బబ్లింగ్ చేస్తే కూడా అంగీకరించేది లేదని టీఎస్పీఎస్సీ వెల్లడించింది. అభ్యర్థులు హాల్ టికెట్ తో పాటు ఆధార్, పాన్ కార్డులు, ప్రభుత్వ ఉద్యోగి అయితే ఆ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు వంటి ఫొటోలతో కూడిన ప్రభుత్వ ఐడెంటిటీ కార్డులను తీసుకురావాలని అధికారులు సూచించారు. ఎగ్జామ్ సెంటర్ లో పరీక్షలు రాసే అభ్యర్థులు ఎవరైనా సరే నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు పెడుతామని హెచ్చరించారు.
భవిష్యత్తులో కమిషన్ నిర్వహించే పరీక్షలు రాయకుండా డిబార్ చేస్తామని తెలిపారు. తెలంగాణ హైకోర్టు నిర్ణయంతో పరీక్షా నిర్వహణకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేయబోతున్నారు. ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న అభ్యర్థులకు ఇది గుడ్ న్యూస్ అనే చెప్పాలి. చాలా కాలంగా గ్రూప్ వన్ ఎగ్జామ్ కోసం దాదాపు 3 లక్షల 60వేలకుపైగా అభ్యర్థులు అతృతగా ఎదురుచూస్తున్నారు. ఇప్పుడు న్యాయస్థానం స్పష్టమైన ఆదేశాలతో అభ్యర్థుల్లో నమ్మకం ఏర్పడింది. హైకోర్టు నిర్ణయంతో 11వ తేదీ ఆదివారం గ్రూప్ 1 ఎగ్జామ్ నిర్వహించాలని అధికారులు కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందుకోసం అన్ని ఏర్పాట్లు చేయాలని నిర్ణయించారు. మొత్తం 3 లక్షల 63 వేల మంది గ్రూప్ 1 ఎగ్జామ్ రాసేందుకు దరఖాస్తు చేసుకున్న విషయం తెలిసిందే. 503 పోస్టులకు టీఎస్ పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. 2022 ఏప్రిల్ 26న 503 పోస్టులతో తెలంగాణ తొలి గ్రూప్-1 ప్రకటనను టీఎస్‌పీఎస్సీ వెలువరించింది. రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల 63 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. అక్టోబరు 16న ప్రిలిమినరీ నిర్వహించగా 2,85,916 మంది రాశారు. పేపర్ లీకేజీ కారణంతో ఈ పరీక్షను రద్దు చేసి, జూన్11న నిర్వహించనున్నారు.

### విద్యుత్ రంగంలో
# విప్లవాత్మక విజయాలు

(మొదటి పేజీ తరువాయి)
దాదాపు రూ. వంద కోట్లతో 13 నూతన విద్యుత్ ఉపకేంద్రాలను ఏర్పాటు చేసి నిరంతర విద్యుత్ అందజేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. నియోజకవర్గంలో నూతనం సబ్ స్టేషన్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో రైతులకు రాత్రిపూట రైతులు పోలాలకు వెళ్లకుండా చేశారాన్నరు. గతంలో ఎందరో పాము కాటు, విద్యుత్ షాకులకు గురయ్యారన్నారు. ఇప్పుడు అలాంటి సమస్యలేదన్నారు. తెలంగాణ రాష్ట్ర వస్తే అందకారమవుతుందని కరెంటు తీగలమీద బట్టలు ఆరేసుకోవాల్సిన పరిస్థితి వస్తుందని అప్పటి సమైక్య పాలకులు ఏద్దేవ చేశారని శాపనార్థాలు పెట్టారని కానీ వారి అంచనాలను తలక్రిందులు చేసి తెలంగాణ ప్రభుత్వం విప్లవాత్మక విజయాలను సాధించామన్నారు. జిల్లా కలెక్టర్ షాస్మిన్ బాషా మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల పనితీరు బాగుందని, వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్తు ఇస్తూ ఇతర రంగాలకు నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామన్నారు. జెడ్పీచైర్పర్సన్ దావ వసంత, జిల్లా ఎస్పీ భాస్కర్, ఆర్డీవో వినోద్ కుమార్, మున్సిపల్ చైర్పర్సన్లు రాణవేని సుజాత లావణ్య, ఎంపీపీ మారు సాయిరెడ్డి, జాజాల భీమేశ్వరీ, విద్యుత్ ఏడీఈ దురిశెట్టి మనోహర్, ఏఈలు అమరేందర్, రవి, రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు చీటి వెంకట్రావు, రైతులు, విద్యుత్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# రెజ్లర్లకు దక్కని ఊరట

మొదటిపేజీ తరువాయి..
హోంమంత్రిని కలిసిన వారిలో రెజ్లర్లు భజరంగ్ పునియా, సాక్షి మాలిక్ , సంగీతా ఫోగట్, సత్యవర్త్ కడియన్ ఉన్నారు. మైనర్‌తో సహా ఏడుగురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపించిన బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై నిష్పాక్షిక విచారణ జరిపి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు డిమాండ్ చేశారు. అయితే హోంమంత్రి అమిత్‌షా వారికి అనుకూలంగా హామీ ఇవ్వలేదని రెజ్లర్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, చట్టం తనపని తాను చేసుకుంటూ పోతుందని చెప్పినట్లు రెజ్లర్లు తెలిపారు. రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్‌పై చర్యలు తీసుకోవాలని రెజ్లర్లు ఇచ్చిన గడువు శనివారం ముగియడంతో హోంమంత్రి అమిత్‌షాతో సమావేశానికి రెజర్లు కోరినట్లు తెలుస్తోంది.
మరోవైపు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ని అరెస్ట్ చేయాలని నెల రోజులుగా రెజ్లర్లు చేస్తున్న ఆందోళనలకు ఇక ఫుల్‌స్టాప్ పడే అవకాశాలున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిణామాలు అవే సంకేతాలిస్తున్నాయి. ఇప్పటికే బ్రిజ్ భూషణ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన మైనర్ రెజ్లర్ తన స్టేట్‌మెంట్‌ని వెనక్కి తీసుకుంది. ఇప్పుడు ఈ వివాదం మరో మలుపు తిరిగింది. రెజ్లర్ సాక్షి మాలిక్ ఆందోళనను ఉపసంహరించుకుంది. స్పోర్ట్స్ కోటాలో ఆమెకు నార్తర్న్ రైల్వేలో ఉద్యోగం వచ్చింది. ఉద్యమం ఉపసంహరించుకుని మళ్లీ డ్యూటీలో చేరిపోయినట్టు సమాచారం. ఆమెతో పాటు మరో రెజ్లర్ బజ్‌రంగ్ పునియా కూడా విధుల్లో చేరాడు. కేంద్రహోం మంత్రి అమిత్‌షాతో భేటీ అయిన తరవాత ఈ నిర్ణయం తీసుకున్నారు. అమిత్‌షాతో జరిగిన చర్చలు అసంపూర్తిగానే మిగిలిపోయాయని, తాము అనుకున్న స్పందన ఆయన నుంచి రాలేదని సాక్షి మాలిక్ భర్త ఇప్పటికే వెల్లడించారు. ఈ సమావేశంలో సాక్షిమాలిక్‌తో పాటు వినేష్ ఫోగట్, బజ్‌రంగ్ పునియా కూడా పాల్గొన్నారు. అయినా...ఇద్దరు రెజ్లర్లు ఒకేసారి ఆందోళనలు ఉపసంహరించుకోవడంపై చర్చ జరుగుతోంది. కాగా.. రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్‌పై నిరసనను పెద్దగా పట్టించుకోలేదని ఆరోపించిన రెజ్లర్లు.. గత నెలలో గంగా నదిలో తమ పతకాలను నిమజ్జనం చేస్తామని రెజ్లర్లు ప్రకటించారు. అయితే రైతుసంఘం నేత నరేష్ టికాయత్ జోక్యంతో తాత్కాలికంగా విరమించుకున్నారు. అంతకుముందు..కొత్త పార్లమెంటు ప్రారంభోత్సవం సందర్భంగా రెజ్లర్లు పాదయాత్ర ద్వారా నిరసన తెలిపారు. ఢిల్లీ పోలీసులు పలువురు ఆందోళనకారులను అదుపులోకి తీసుకున్నారు. ఛాంపియన్లు వినేష్ ఫోగట్, సంగీతా ఫోగట్‌లను పోలీసులు నేలపై పిన్ చేసిన దృశ్యాలు దిగ్భ్రాంతికి గురిచేశాయి. అనంతరం జంతర్ మంతర్‌లో రెజ్లర్ల నిరసన ప్రదేశాన్ని పోలీసులు బలవంతంగా ఖాళీ చేయించారు. కాగా.. రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై పోలీసులు రెండు కేసులు నమోదు చేశారు. మైనర్ రెజ్లర్ తండ్రి, ఆరుగురు మహిళా రెజ్లర్లు లైంగిక వేధింపులపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు బ్రిజ్ భూషణ్‌పై ఈ కేసులు నమోదయ్యాయి. మరోవైపు రెజ్లింగ్ ఫెడరేషన్ చీఫ్ బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్ తనపై వస్తున్న ఆరోపణలు స్పందించారు. ఈ కేసులో తాను నార్కో టెస్ట్‌కు కూడా సిద్ధమేనని ప్రకటించారు. బీజేపీ ఎంపీ, రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని టాప్ మహిళా రెజ్లర్లు ధర్నా చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆ రెజ్లర్లు శనివారం అర్ధరాత్రి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాను కలిశారు. అయితే ఆ మీటింగ్ అసంపూర్ణంగా ముగిసినట్లు సాక్షీమాలిక్ భర్త సత్యవ్రత్ ఖదియాన్ తెలిపారు. కేంద్ర మంత్రి షా నుంచి సరైన రీతిలో స్పందన రాలేదని సత్యవ్రత్ తెలిపారు. అమిత్ షా నివాసంలో రెజ్లర్లతో భేటీ జరిగింది. లైంగిక ఆరోపణలు ఎదుర్కొంటున్న బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భజరంగ్ పూనియా, సాక్షీ మాలిక్, సంగీతా పోగట్, సత్యవ్రత్ ఖదియాన్ మీటింగ్‌కు హాజరయ్యారు. నిష్పాక్షికంగా విచారణ జరగాలని కోరారు. అయితే చట్ట ప్రకారమే చర్యలు ఉంటాయని అమిత్ షా అన్నారని తెలిసింది. గంగా నదిలో మెడల్స్‌ను పారేసేందుకు ప్రయత్నించిన రెజ్లర్లు ఆ తర్వాత ప్రభుత్వానికి డెడ్‌లైన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ డెడ్‌లైన్ నేపథ్యంలో షాతో మీటింగ్ జరగాలని రెజ్లర్లు కోరారు.

## రైల్వే శాఖలో ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)
మంత్రి అశ్విని వైష్ణవ్ కు వినోద్ కుమార్ లేఖ రాశారు.
దేశవ్యాప్తంగా రైల్వే శాఖలో 3.12 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని ఒక సౌత్ సెంట్రల్ రైల్వే కీలక విభాగాలలోనే 30 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, ఇతర విభాగాల్లో ఇంకా అనేక ఖాళీలు ఉంటాయని వినోద్ కుమార్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి రాసిన లేఖలో పేర్కొన్నారు. రైల్వే శాఖలో ఉద్యోగాల ఖాళీల వల్ల ప్రస్తుతం పని చేస్తున్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందని, దీని వల్ల పలు ప్రమాదాలు, అనర్థాలకు దారితీస్తోందని వినోద్ కుమార్ అన్నారు.
రైల్వే శాఖలో సౌత్ సెంట్రల్ రైల్వే ప్రయాణీకులు, సరుకుల రవాణా ద్వారా అధిక ఆదాయం సమకూరుస్తు కీలక పాత్ర పోషిస్తోందని వినోద్ కుమార్ తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లతో పాటు కొంత భాగం కర్ణాటక, మహారాష్ట్ర లలో సౌత్ సెంట్రల్ రైల్వే సేవలు అందిస్తోందని ఆయన అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే పరిధిలో కీలకమైన ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని, టికెట్ కలెక్టర్స్, స్టేషన్ మాస్టర్స్, లోకో మోటివ్ పైలట్స్, ట్రాక్ మెంటేనర్స్, టెక్నికల్ స్టాఫ్, ఇతర పోస్టులు ఖాళీగా ఉన్నాయని వినోద్ కుమార్ పేర్కొన్నారు. నిరంతరంగా రైల్వే ట్రాక్స్ ను , సిగ్నల్స్ లైటింగ్స్ ను పర్యవేక్షణ చేసేందుకు తగిన స్థాయిలో సిబ్బంది లేని కారణంగా ప్రమాదాలకు చోటు కలుగుతోందని వినోద్ కుమార్ ఆందోళన వ్యక్తం చేశారు. చాలీచాలని ఉద్యోగులు ఉన్న ప్రస్తుత తరుణంలో, ఉన్న సిబ్బందిపై పని ఒత్తిడి పెరుగుతోందని, దీంతో వారు మానసికంగా కృంగి పోతున్నారని వినోద్ కుమార్ తెలిపారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, నిరంతరం వృత్తి శిక్షణ శిబిరాలు నిర్వహించాలని, ఉద్యోగులకు ఇన్సెంటివ్ లు ఇచ్చి ప్రోత్సహించాలని, రైలు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌కు రాసిన లేఖలో వినోద్ కుమార్ సూచించారు.



## ఉపాధి హామీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని ధర్నా

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** ఉపాధి హామీ పథకంలో పని చేస్తున్న కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం, జనగామ జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళంపల్లి జనార్ధన్ అన్నారు. సోమవారం ఉపాధి హామీ కార్మికులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కోరుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చట్టాలు అమలు చేయడంలేదని, చట్టంలో ఉన్న కనీస వసతులు త్రాగు నీరు, ఓఆర్ఎస్ మజ్జిగ, మెడికల్ కిట్, సేద తీర్చుకొనేందుకు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. జాతీయ పిలుపు మేరకు ధర్నా చేపట్టారు. తదుపరి డిమాండ్‌తో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆది సాయన్న, సొప్పరి సోమయ్య, నాయకులు నక్కిర్త రాములు, పిట్టల కుమారస్వామి, సి. హెచ్. మల్లేశం, రెడ్డబోయిన వెంకటయ్య, దండుగుల ఐలయ్య, పొన్నమైన బాలరాజు, బెజగం ఎల్లయ్య పాల్గొన్నారు.

## వెంకిర్యాలలో ముమ్మురంగా బడి బాట

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా వెంకిర్యాల గ్రామ పంచాయితీ వద్ద సర్పంచ్ కీర్తి లక్ష్మి నర్సయ్య అధ్యక్షతన గ్రామ ప్రాథమిక పాఠశాల, హైస్కూల్ తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.... బడి ఈడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ



కార్యక్రమంలో విద్యకు ప్రాధాన్యతనిస్తూ మన ఊరు మనబడి కార్యక్రమం కింద స్కూళ్లలో సకల సౌకర్యాలు కల్పిస్తుందని, ఆధునాతన సౌకర్యాలు డిజిటల్ బోధనలో విద్య నూతన ఒరవడిలతో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో ఆంగ్లమాధ్యంలో నాణ్యమైన విద్యను అందిస్తూ ప్రైవేట్ కార్పొరేటు విద్యాసంస్థలకు దీటుగా పనిచేస్తున్నందున మన ఊరు ప్రభుత్వ పాఠశాలలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉన్నదని గ్రామ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు దూడల రమేష్, నర్సింహారెడ్డిలు విద్యా కమిటీ చైర్మన్ తాళ్లపల్లి అశోక్ గౌడ్ ఉపాధ్యాయులు లలిత, విద్యారాణి అనురాధ సంపత్, జగదాంబ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## షిరిడి సాయికి ఘనంగా సహస్ర కలశాభిషేకం

**జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):** స్థానిక శ్రీ షిరిడి సాయిబాబా మందిరంలో 24వ వార్షికోత్సవాల్లో భాగంగా ఈరోజు మూడో రోజు సోమవారం ఉదయం గణపతి పూజ, పుణ్యాహవచనం, గౌరీ పూజ, సహస్ర కలశ స్థాపన, సహస్ర కలశఅభిషేకం, శ్రీ లక్ష్మీ నారాయణ సహిత రుద్ర హెూమం, పూర్ణాహుతి, విమానోపరి కుంబాభిషేకం, లక్ష పుష్పార్చన, హారతి, మంత్రపుష్పం అనంతరం అన్నదానం జరిగింది. ఈ





కార్యక్రమాలన్నీ ప్రముఖ జ్యోతిష్య, వాస్తు, పౌరాణిక, వేద, పండితులు నంబి వేణుగోపాలచార్య కౌశిక, ప్రత్యక్ష పర్యవేక్షణలో మరియు శ్రీ సుగుణానంద స్వామి విజయవాడ వారి పర్యవేక్షణలో జరిగాయి. ప్రముఖ పౌరాణిక, వేద పండితులు తిగుళ్ల విశు శర్మ మరియు ఆలయ ప్రధాన అర్చకులు వేనయ్య బృందంతో కార్యక్రమాలు కొనసాగాయి.సాయంత్రం సహస్ర దీపాలంకరణతో కార్యక్రమాలు ముగుస్తాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యవర్గ సభ్యులు మరియు అధ్యక్షులు డాక్టర్ సతీష్ కుమార్, నాగుల కిషన్ గౌడ్, మార కైలాసం, పురుషోత్తం రావు, రామ్ కిషన్ రావు, సామాజిక కార్యకర్త తవుటు రామ చంద్రం, సత్సంగ్ సభ్యులు, పుర ప్రముఖులు, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ కేంద్రాలలో శ్రీమంతాలు

**గొల్లపల్లి జూన్ 05(ప్రజామంటలు):** గొల్లపల్లిలో గర్భవతులకు తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శ్రీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గర్భవతులు తీసుకొనవలసిన జాగ్రత్తలు ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రసవాల గూర్చి గర్భిణీ స్త్రీ 10 నుంచి 12 కేజీల బరువు



పెరుగుటకు రోజు ఆహారంలో మిల్లెట్స్ తీసుకొనవలెనని కొర్రలు ఆర్కలు రాగులు సజ్జలు జొన్నలు మరియు ఆకుకూరలు కూరగాయలు పండ్లు, గుడ్డు తీసుకొనవలెనని రోజు ఆహారంలో ఐరన్ ఎక్కువగా ఉండే పదార్థాలు తీసుకొనవలెనని తల్లులకు అవగాహన కలిగించనైనది 2 ప్లస్ పిల్లలను అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేయించవలెనని కిశోర బాలికలకు ఆరోగ్యం పౌష్టికాహారం పరిశుభ్రత బహిస్తుపై విద్య యొక్క ప్రాముఖ్యత మిల్లెట్స్‌పై కిషోర్ బాలికలకు అవగాహన కలిగించనైనది.

ఈ కార్యక్రమానికి అంగన్వాడి సూపర్వైజర్ మమత, గర్భవతులు, కిశోర బాలికలు, తల్లులు అంగన్వాడీ టీచర్స్ సరోజన, ఉమా, హరి ప్రియ, అనంతలక్ష్మి, విజయ, జమున, ఆయాలు పిల్లలు పాల్గొన్నారు.

## పౌష్టికాహారంతోనే తల్లి, బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

**జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):** పౌష్టికాహారం తీసుకుంటేనే తల్లి, బిడ్డ పూర్తి ఆరోగ్యంగా ఉంటారని జగిత్యాల సిడిపిఓ వీరలక్ష్మి అన్నారు. జగిత్యాల పట్టణంలోని సవరాల వాడ అంగన్వాడీ కేంద్రం లో సోమవారం గర్భిణీలకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సీడీపీఓ వీరలక్ష్మి మాట్లాడుతూ.... గర్భిణిగా ఉన్నప్పటి నుంచే పోషకాహారం తీసుకోవాలని, తద్వారా పుట్టబోయే బిడ్డకు ఆరోగ్యకరమైన జీవితాన్ని ప్రసాదించిన వారవుతారని అన్నారు. పౌష్టికాహారం ప్రాముఖ్యతను వివరించడంతో పాటుగా, ప్రతి అంగన్వాడీ కేంద్రం లో, ఇంటి ఆవరణ లో అందరూ న్యూట్రి గార్డెన్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ ఫ్రూట్స్ తినాలని, తల్లులు, పిల్లల పోషణ స్థితి గురించి ఇప్పటికిప్పుడు తెలుసుకోవాలని వివరించారు. ఒక మహిళ గర్భం దాల్చిన ప్పటి నుండి పుట్టిన బిడ్డకు రెండు సంవత్సరాల నిండే వరకు కూడా చాలా కీలక



మైన దశ అని, ఈ దశలోనే ఎక్కువగా మానసిక, శారీరక అభివృద్ధి జరుగుతుందని తెలిపారు.

గర్భిణీ జీవితంలో మొదటి 1000 రోజుల ప్రాముఖ్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్స్ రాణి, జానకి అంగన్వాడీ టీచర్లు లక్ష్మి, సీమ పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

### ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహిత్య సంస్థ

## జూమ్ మీటింగ్‌లో రేణుకుంట్ల మురళి

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** ది ఫర్టైల్ బ్రేన్స్ అంతర్జాతీయ ఆంగ్ల సాహితీ సంస్థ ఓపెన్ థీమ్ పై జూమ్ సమావేశం సంస్థ అధినేత కె.కుమార్ ప్రసన్న ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ సమావేశంలో ప్రపంచ నలుమూలలనుండి కెనడా, యుకె, యుఎస్ఎ,పాకిస్థాన్, బ్రెజిల్, ఫిలిఫ్ఫిన్స్, సింగపూర్, ఇజ్రాయిల్, ఇండియా, గ్రీకు, నెదర్లాండ్స్, రోమా నియా, దుబాయ్, నేపాల్, బంగ్లాదేశ్, జమైకా దేశాలనుండి నలబై మంది ప్రముఖ కవులు, రచయితలు పాల్గొని పర్యావరణ పరిరక్షణ, అమ్మ ప్రేమ, ప్రకృతి, నైతిక విలువలు మొదలైన అంశా లపై రాసిన కవితలను ఆలపించారని, తెలంగాణ



నుండి చురుకుగా పాల్గొంటున్న ఫర్టైల్ బ్రేన్స్ రాష్ట్ర కో-కన్వీనర్ రేణుకుంట్ల మురళి తెలిపారు. ఈ సమావేశంలో మనటిట హచిన్ సన్, సరస్వతి పోశ్వాల్, ఐజాక్ కొహెన్, డామినిక్ విన్ డ్రమ్, డాక్టర్ రూపా సర్కార్ గౌర్, రేయ్ విటాకర్, జూహీ గుప్తే, అనుపమ, జయ కల్యాణ రమణ్, మీనా చౌవాన్, మైఖల్ ఆంతోనీ ఇంగ్రామ్, డానీ ఇన్నే, నైమ చంచౌన్, జాకీ చౌ, షాలిని నంద కియోల్కర్, గార్గి మిశ్రా, సుదిపా మిశ్రా, సోమదత్తా మిత్ర, అలెగ్జాండ్రా పొసరొ పోలో, రాబర్ట్ ఫ్లెమింగ్, టిల్ కుమారి శర్మ, డాక్టర్ గంగలక్ష్మి పట్నాయక్, రీమా రాయ్ సింగ్, హీరా నవాజ్, దుర్గాచారి, రేణుకుంట్ల మురళి, సిల్వియా కేంగ్ అంగ్, శామ్యూల్ రేన్స్ తదితరులు పాల్గొన్నారు.

## నిత్య కోతల నుంచి నిరంతర వెలుగులకు ప్రస్థానం

**అన్ని రంగాలకు నిరంతర 24 గంటల విద్యుత్ సరఫరా**

**ఇది స్వరాష్ట్రం సాధించిన ఘనత**

**విద్యుత్ విజయోత్సవం**

**హుస్నాబాద్ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్**



**హుస్నాబాద్ జూన్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాలలో భాగంగా జూన్ 5, విద్యుత్ విజయోత్సవం కార్యక్రమం హుస్నాబాద్ నియోజకవర్గం స్థాయిలో పోతారం (ఎస్) శుభం గార్డెన్ లో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హుస్నాబాద్ శాసనసభ్యులు వొడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. ఎంఎల్ఏ మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో కరెంటు ఉంటే వార్త, కానీ ఇప్పుడు స్వరాష్ట్రంలో కరెంటు పోతే వార్త అన్నట్టుగా విద్యుత్ ఉత్పత్తిలో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలిచిందని సీఎం కేసీఆర్ దూరదృష్టి, కృషి పట్టుదలతో ఇది సాధ్యమైందని అన్నారు. నేడు పరిశ్రమల కోసం మరియు వ్యవసాయ అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్తు ఇస్తున్న రాష్ట్రం దేశంలో కేవలం తెలంగాణ రాష్ట్రం మాత్రమేనని అన్నారు. రానున్న రోజుల్లో దేశంలో విద్యుత్ మిగులు రాష్ట్రంగా తెలంగాణ మారబోతుందని ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఎస్సీ, ఎస్టీ వినియోగదారులకు , పవర్లూమ్ వినియోగదారులకు, స్పిన్నింగ్ మిల్స్, పౌల్ట్రీ ఫార్మ్స్ కు సబ్సిడీలు ఇస్తున్నామని హెయిర్ కటింగ్ సెలూన్స్‌కు, లాండ్రీ షాపులకు మరియు దోబిగాట్‌లకు ఫ్రీగా కరెంటు ఇస్తున్న రాష్ట్రం తెలంగాణ రాష్ట్రం అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో అవసరమున్న ప్రతిచోట సబ్ స్టేషన్లు ఏర్పాటు చేసుకొని, కొత్తగా దాదాపు నాలుగు వేల ట్రాన్స్ఫార్మర్లను నిర్మించుకున్నామని అలాగే నాగ సముద్రాలలో 220 కెవి సబ్‌స్టేషన్ నిర్మాణం చేసుకున్నామని మిగులు విద్యుత్‌ను స్టోరేజ్ చేసుకుని వాడుకునే వెసులుబాటు కూడా కల్పించుకున్నామని ఎమ్మెల్యే అన్నారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో వ్యవసాయ వినియోగం, పరిశ్రమల కోసం గృహ అవసరాల కోసం నాణ్యమైన విద్యుత్ అందిస్తున్నామని ఇందుకోసం కృషి చేస్తున్న విద్యుత్ సిబ్బందిని ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జెడ్పి చైర్ మెన్ సుధీర్ కుమార్, సిద్దిపేట జిల్లా వైస్ ఛైర్మెన్ రాయిరెడ్డి రాజిరెడ్డి, హుస్నాబాద్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ప్రజా ప్రతినిధులు, విద్యుత్ సిబ్బంది రైతులు, ప్రజలు, వినియోగదారులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చేపలు పట్టే జన్మహక్కు గంగపుత్రులదే...

**గంగపుత్రుల కులవృత్తిని పంచడమేంటి**

**గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంఘం అధ్యక్షులు తిరుపతి**

**జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):** తర తరాలుగా, యుగయుగాలుగా చేపలు పట్టే జన్మహక్కు గంగపుత్ర, గూండ్ల కులస్తులదని ఇదే మాటను ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సాక్షిగా ప్రకటించినా గంగపుత్రులకు తీరని అన్యాయం జరుగుతోందని గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం సహాయనిధి ఫౌండేషన్ అద్యక్షులు సముద్రాల తిరుపతి అన్నారు. సోమవారం దుబాయ్ లో ఆ సంఘ సభ్యులతో తిరుపతి సమావేశం నిర్వహించారు. ఇందులో చేపలు పట్టే జన్మహక్కు గంగపుత్ర గూండ్ల కులస్తులకే ఉందన్నారు. ఇదే మాటను ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించారన్నారు. కానీ గంగపుత్రుల జన్మహక్కు లో ముదిరాజ్ లతో పంచుకోవడం బాధాకరమన్నారు. మత్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ పదవిని పిట్టల రవీందర్ కు ఇవ్వడాన్ని గల్ఫ్ గంగపుత్ర ఐక్యత సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీఆర్ఎస్ పార్టీలోని గంగపుత్రులకు ఎవరికి



ఇచ్చినా సంతోషించే వారమని తిరుపతి పేర్కొన్నారు. ఇప్పటికైనా గంగపుత్రుల గుండ్ల కులస్తుల జన్మహక్కును రాష్ట్ర ప్రభుత్వం గుర్తించాలని అప్పుడే గంగపుత్రులకు న్యాయం జరుగుతుందని తిరుపతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు తోకల శంకర్, కార్యదర్శి బోరే ఇందయ్య గంగపుత్ర, కోశాధికారి సముద్రాల నరేష్, మేడి రమేష్, గుమ్ముల శ్రీనివాస్, గౌరవ సలదారులు పల్లికొండ రాములు, బింగి రాజు, బోరే రాజన్న, హనుమంతుపల్లి అధ్యక్షులు బింగి పోషన్న, సభ్యులు కమలాకర్, రేకులపల్లి అధ్యక్షులు శేఖర్ కొంద్రు, పందిరి చంద్రయ్య పాల్గొన్నారు.

## అంగన్వాడి కేంద్రాలలో గర్భిణీలకు సామూహిక శ్రీమంతాలు

**రాయికల్ జూన్ 05 (ప్రజామంటలు):** రాయికల్ మున్సి పాలిటీ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలు మహిళా సంక్షేమ దినోత్సవంలో భాగంగా రాయికల్ మున్సిపల్ పరిధిలోని 01, 02, 03 అంగ న్వాడి కేంద్రాలలో సోమవారం రోజున గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతాలు (శ్రీమంతాలు) చేశారు. ఈ స0దర్భ0గా ఐసిడియస్ సూపర్



వైజర్ పద్మావతి మాట్లాడుతూ.... గర్భిణులు ఆహారం వేడిగా ఉన్నప్పుడే భుజి0చాలని, విశ్రాంతి చాలా అవసరమని, ఏలాంటి పరిస్థితులలో బరువులు ఎత్తకూడదని, పోషకాలతో కూడిన ఆహారం సమపాళ్ళలో తీసుకోవడం మంచిదని అన్నారు. చిరుధాన్యాలతో చాల రకాలుగా అల్పాహారం చేసుకోవచ్చని, తప్పకుండా ఎప్పటికప్పుడు వైద్యుల సూచనలు తీసుకోవాలని, సరియైన సమయంలో మందు బిల్లలను వేసుకోవాలని అన్నారు. ప్రసవ సమయానికి 102 అందుబాటులో ఉంటుందని అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్స్ సిలివేరి సుమలత, పుష్పలత, గుమ్మడి సింధూరి, ఆయాలు విజయలక్ష్మి, రాజేశ్వరి, రాజమణి, గర్భిణులు, మహిళలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.




## అంగన్వాడి కేంద్రాల్లో శ్రీమంత వేడుకలు

**కొడిమ్యాల జూన్ 05 (ప్రజామంటలు):** జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం పూడూరు సెక్టార్ పరిధిలోని చెప్యాల, రామకృష్ణాపురం, పూడూర్ గ్రామాల్లోని పలు అంగన్వాడీ కేంద్రాల్లో శ్రీమంతాల కార్యక్రమాలను ఐసిడిఎస్ మల్యాల ప్రాజెక్టు వారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా గర్భవతులకు 1000 రోజుల ప్రాముఖ్యతను గురించి, చిరుధాన్యాల వాడకం ఆరోగ్యము పరిశుభ్రతలను గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎన్. సుధారాణి పూడూరు గ్రామానికి చెందిన గ్రామ ఉప సర్పంచ్ బండ లింగారెడ్డి, సెక్రెటరీ మనోహర్ రెడ్డి, సిహెచ్ఓ. వందన ఏఎన్ఎం సంధ్యారాణి, అంగన్వాడీ టీచర్లు సురేఖ వసంత, పద్మ, స్నేహలత పుష్పలతలు, చెప్యాల గ్రామంలో ఎంపిటిసి మల్లారెడ్డి, ఉప సర్పంచ్ గుంటి ఎల్లయ్య, సెక్రెటరీ అంగన్వాడీ టీచర్లు ఎం. ఉమ, టి. అంజలి, బి. సుజాత, డి. జ్యోతి, రామకృష్ణాపూర్ గ్రామంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ నవీన్, సిఎ. అర్చన, అంగన్వాడీ టీచర్లు ఎలగుర్తి వినోద, దువ్వంతుల విజయ ,పీల్డ్ అసిస్టెంట్ బాలయ్య, ఆశా కార్యకర్తలు, అయాలు పిల్లల తల్లిదండ్రులు పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా దేవాలయ వార్షికోత్సవం

**కోరుట్ల మే 05 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని అతి ప్రాచిణమైన నగరేశ్వర స్వామి దేవాలయ వార్షికోత్సవ వేడుకలు పట్టణ పురోహితులు పాలెపు రామకృష్ణ శర్మ, దేవాలయ ప్రధాన అర్చకులు దివాకర్ శర్మ వైదిక నిర్వహణలో వైభవంగా నిర్వహించారు. ఉదయం మూల మూర్థులకు ఫల, పంచామృత అభిషేకాలు, రుద్ర, చండి హావనాలు చేశారు. ఈ



కార్యక్రమంలో వేదపండితులు కొలిచాల వినయ్ శర్మ జగిత్యాల జిల్లా ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు కొత్త సురేష్, కోరుట్ల పట్టణ ఆర్య వైశ్య సంఘ అధ్యక్షులు కొత్త సుధీర్, కొత్త సత్యనారాయణ, మారుతి, రాజు, నవీన్,నీలి కాశినాథం, కొత్త సునీల్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## 7వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్

**కరీంనగర్ మే 05 (ప్రజామంటలు):** కరీంనగర్ లో 7వ ఇంటర్ స్టేట్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్ నిర్వహించగా జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన ఎస్ఎస్ఎస్ఎం స్కూల్ సమ్మర్ క్యాంపులో పాల్గొన్న త్రిశిత శ్రీ




వల్లి బ్రాన్జ్ మెడల్ స్వంతం చేసుకొంది. తమ కూతురు కరాటే శిక్షణలో మెడల్ సాధించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. కరాటే మాస్టర్ నరేష్ కు, త్రిశిత శ్రీవల్లి పేరెంట్స్ సామ సుమన్ రజని దంపతులు ధన్యవాదాలు తెలిపారు. తెలిపారు. మెడల్ సాధించిన త్రిశిత శ్రీవల్లి కి సామ రాఘవేంద్ర, సామ సత్యనారాయణ లు శుభాకాంక్షలు తెలిపారు.

## అయిలాపూర్‌లో ఈత వనం దగ్ధం

**కోరుట్లరూరల్ మే 05 (ప్రజామంటలు):** కోరుట్ల మండలం అయిలాపూర్ గ్రామంలో ఈత వనం దగ్ధం అయ్యింది. గౌడ కులస్తులకు చెందిన ఈత



వనంలో అరికుప్పల వెంకటి ఈత వనాన్ని, కుండలు ధ్వంసం చేస్తున్నాడని గౌడ సంఘ సభ్యులు సోమవారం కోరుట్ల ఎస్.ఐ. కి ఫిర్యాదు చేశారు. గత 15 ఏళ్లుగా తమను వెంకటి వేధిస్తున్నాడని, తాజాగా 10 ఎకరాల ఈతవనానికి నిప్పుపెట్టడమే గాక, 60 కుండలను ధ్వంసం చేసినట్లు వారు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన బావ అయిన తిమ్మయ్య పల్లి సర్పంచ్ అండతో అందరినీ బెదిరిస్తున్నాడని వారు ఎస్.ఐ. కి తెలిపారు.

## దేవుడి దర్శనానికి వచ్చి గుండెపోటుతో భక్తుడు మృతి

**కొండగట్టు జూన్ 05 (ప్రజామంటలు):** కొండగట్టు అంజన్న దర్శనానికి వచ్చిన ఓ వృద్ధుడు గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రానికి చెందిన కిష్టయ్య (70) కుటుంబ సభ్యులతో కలిసి అంజన్న దర్శనానికి వచ్చాడు. కోనేరులో స్నానం చేసిన తర్వాత స్వామివారి దర్శనానికి వెళ్తుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి వచ్చింది. కొద్దిసేపటికే గుండెపోటుతో ప్రాణాలు కోల్పోయాడు. పోలీసులు డెడ్ బాడీని వాహనంలో ఆయన స్వగ్రామానికి తరలించారు.

# నీతి ఆయోగ్ సాధించిందేమిటి?

ప్రధానమంత్రి మోడీ సమక్షంలో... ఇటీవల జరిగిన నీతి ఆయోగ్ భేటీలో పలు అంశాలపై చర్చ జరగడం అటుంచితే..పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు హాజు కాలేదు. అలాగే పార్లమెంట్ ప్రారంభోత్సవానికి కూడా పలువురు సిఎంలు, పార్టీల నేతలు దూరంగా ఉన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ప్రజల సంక్షేమం అన్నది ఉమ్మడిగా నిర్ణయించి ముందుకు సాగాల్సి ఉంది. పార్లమెంటులో సమస్యలపై చర్చించడం లేదు. నీతి ఆయోగ్‌లోనూ ప్రధాని ప్రసంగానికే పెద్దపీట వేస్తున్నారు. హాజరైన సిఎంలు ప్రస్తావించిన అంశాలపై చర్చించడం లేదదా, తదుపరి చర్యలు కానరావడం లేదు. మొత్తంగా దేశంలో కేంద్రంలో ఏ పార్టీ అధికారం లో ఉన్నా సమావేశాలు, చర్చలు అన్నవి తూతూ మంత్రంగా సాగుతున్నాయి.సమావేశాలు, చర్చలు అమలు చేస్తున్న కార్యక్రమాలు ప్రజల ఇష్టాఇష్టాలతో సంబంధం లేకుండా సాగడం చూస్తున్నారు. నేక సందర్భాల్లో నీతి ఆయోగ్ సమావేశాల్లో అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులు వివిధ సమస్యలపై నేరుగానే ప్రశ్నించారు. ఆయా రాష్ట్రాల సమస్యలను దేశం దృష్టికి తీసుకెళ్లారు. అయినా లాం లేకపోవడంతో ఇక సమావేశాలకు హాజరు కావడం దండగ అన్న భావనలో ఉన్నారు. నీతి ఆయోగ్ ప్రారంభించి సమయంలో కనిపించిన స్ఫూర్తి లోపించింది. నీతి ఆయోగ్ ఏర్పాటు దశలో ప్రధాని మోడీ ఆనాడు చేసిన ప్రకటనకు భిన్నంగా ఈ తొమ్మిదేళ్లుగా నీతి తప్పిన ఆయోగ్‌గా అవతరించింది. సహకార సమాఖ్య సూత్రాలకు అనుగుణంగా మొత్తం దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే ఆయా రాష్ట్రాలకు తగిన గౌరవం ఇచ్చి వారిని కూడా ఇందులో భాగస్వాములను చేయాల్సి ఉంది. రాష్ట్రాలను కలుపుకుని ముందుకు సాగాల్సిన కేంద్రం ఆ దిశగా పనిచేయడం లేదు. మళ్లీ పాతపద్ధతిలోనే సాగుతోంది. నీతి ఆయోగ్ లక్ష్యాలను విస్మరించారు. ఇక్కడ జరిగే చర్చలకు పెద్దగా ప్రాధాన్యం ఉండడం లేదు. ఇదే విషయాన్ని పలువురు సిఎంలు నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారు. అంతెందుకు ఒకే పన్ను విధానం అంటూ తీసుకుని వచ్చిన జిఎస్టీని సమర్థించిన ఆయా రాష్ట్రాల సిఎంలే ఇప్పుడు దాని బారినుంచి రక్షించాలని కోరుకుంటున్నారు. వివిధ రంగాలపై అది చూపిస్తున్న చెడు ప్రభావాన్ని విశ్లేషించు కోవాల్సిన కేంద్రం ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందే తప్ప ప్రజల కోణంలో ఆలోచించడం లేదు. ప్రజలు అనేక సందర్భాల్లో తమ నిరసనలు వ్యక్తం చేస్తున్నా పట్టించుకోవడం లేదు. బ్యాంకుల్లో దాచుకున్న డబ్బును సొంత అవసరాలకు తీసుకోవ డానికి కూడా ఇబ్బంది పడటాన్ని గ్రామాల్లో ఇప్పటికీ చూస్తున్నాం. నగదు ఉపసంహరణపై ఎన్నో ఆంక్షలు పెట్టారు. ఇలాంటి వాటి వల్ల ప్రజలు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆహారధాన్యాల ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఇవన్నీ నీతి ఆయోగ్‌లో చర్చించడం లేదు. పార్లమెంటులో చర్చకు అవకాశం ఉండడం లేదు. మొత్తంగా పాలకులకు అధికారమే తప్ప ప్రజలు కనబడడం లేదు. ఎంపిలు,ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, గవర్నర్ వ్యవస్థ ఇలా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడం బదులు నానాటికి దిగజారుస్తున్నాయి. ప్రజల డబ్బు నీళ్లప్రాయంగా ఖర్చవుతోంది. రాజకీయాల్లో ఎదుటి పక్షాలను ఢీకొట్టేందుకు తమ తెలివిని ఉపయోగి స్తున్న




పాలకులు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో శ్రద్ధ చూపడం లేదు. ఈ దశలో ఇలాంటి ప్రజాస్వామ్యం కొనసాగితే మరో 75 ఏళ్లయినా మన భారత్ రాత మారదు. రాజకీయ సంస్కరణలు రావాలి. పాలకుల తీరులో మార్పు రావాలి. ప్రజాధనం వృధా ఖర్చులకు కళ్లెం పడాలి. ముక్కుపిండి వసూలు చేస్తున్న పన్నులను పాలకుల విసలాలకు ఖర్చు చేసుకుంటున్నారు. రాజ్యాంగం ఏ మేరకు ఎంతవరకు అమలు సాధించామన్నది పాలకులుగా రాజకీయ పార్టీల నేతలు మననం చేసుకోవాలి. అందరికీ సమ న్యాయం అందుతుందా అన్నది చూడాలి. నేలవిడిచి సాము చేసే విధంగా దేశీయంగా ఉత్పత్తులపై దృష్టి పెట్టి స్వయం సమృద్ధి సాధించకుండా దావోస్ లాంటి వేదికలపై పెట్టుబడులకు వెంపర్లాడుతున్న విధానం పోవాలి. దేశీయంగా ఉన్న సాంకేతి కతను ఉపయోగించుకుని యువతను స్వయం సమృద్ధికి సన్నద్ధం చేయాలి. వ్యవసాయం, అనుబంధ రంగాలను అభివృద్ధి చేస్తే ఈ దేశం ఇతర దేశాలకు ఆహారధాన్యాలను ఎగుమతి చేయగలదు. సింగపూర్, మలేషియా తదితర చిన్నదేశాలను ఆదర్శగా తీససుకుని ఆయా రాష్ట్రాలు స్వయం సమృద్ధి సాధించే ప్రణాళికలతో సాగాల్సిన అవసరాన్ని గుర్తించాలి. ప్రజలు సంపూర్ణత సాధించేలా పథకాలు అమలు కావడం లేదు. నిరుద్యోగ సమస్య రోజురోజుకు పెరుగుతోంది. ఆరోగ్యం అందని ద్రాక్షగా మారింది. విద్య విలాసవస్తువుగా మారింది. ఇలాంటి అసమానాతలను రూపుమాపేందుకు పాలకులు చిత్తశుద్ధితో కృషి చేయాలి. ఆనాటి పాలకుల దూరదృష్టి లోపం కారణంగా మనకు వారసత్వంగా వచ్చిన సకల అవలక్షణాలు ప్రజలను ఇంకా దరిద్రంలోనే ముంచెత్తుతున్న వేళ పాలకులు గతాన్ని నెమరేసుకుని ముందుకు సాగాల్సిన వేళ ఇది. ఇంతకాలం ఎక్కడ లోపం ఉందో గుర్తించి అవలోకనం చేసుకోవాలి. ఆత్మపరిశీలన చేసుకోవాలి. విద్యావైద్యరంగం ఎందుకు వెనకబడి ఉందో తెలుసుకోవాలి. ఆహారధన్యాలను ఇంకా ఎందుకు దిగుమతి చేసుకుంటున్నామో ఆలోచన చేయాలి. రాజకీయ దృక్కోణంలో కాకుండా అభివృద్ధి కోణంలో పాలన చేయాల్సిన విషయాన్ని పాలకులు వంటబట్టించు కోవాల్సి ఉంది. ఐదేళ్లు అధికారంలోకి రాగానే మరో ఐదేళ్లు గద్దెపై ఉండడ మెలా అన్న ఆలోచన చేయడం వల్లనే భారత్ కూడా ఇంకా దారిద్యం, నిరక్షరాస్యత, వసతుల కొరత, ఆహారధాన్యాల కొరతతో అలమటిస్తోంది. ఇదంతా పాలకుల దృష్టి లోపంగా చూడాలి. నిజానికి దేశంలో నల్లధనం, అవినీతి పోవాలంటే రాజకీయ పార్టీల నుంచే ప్రక్షాళన మొదలవ్వాలి. నల్లధనం రూపంలో రాజకీయ పార్టీలు విరాళాలు తీసుకుని ఓటర్లను కొనుగోలు చేయడానికి వాడుతున్నాయి. ఎన్నికలు అయ్యాక తగిన మెజారిటీ సమకూరని సందర్భాలలో ఎమ్మెల్యేలు లేదా ఎంపీల బేరసారాల కోసం ఈ నల్లధనాన్నే వాడుతున్నారు. వ్యాపారులు, పారిశ్రామిక వేత్తలు రాజకీయ పార్టీలకు ఇస్తున్న విరాళాలలో అత్యధిక భాగం నల్లడబ్బు రూపంలోనే ఉంటోంది. ఈ పరిస్థితిని నివారించకుండా ఎన్ని సంస్కరణలు చేసినా ఫలితం ఉండదు. ప్రజలకు అందని నగదు రాజకీయ పార్టీలకు మాత్రం లభిస్తోంది. ఎన్నికల్లో ఆయా పార్టీలు వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న వైనం చూస్తున్నాం. అన్నిరంగాల్లో మనం ముందంజ వేయాల్సిన దశలో ఇంకా దిగుబడులపై ఆధారపడుతూ ఎగుమతుల విషయంలో లక్ష్యం లేకుండా సాగుతున్నాం. మనం చేపట్టిన సంస్కరణలు ఫలితాలు ఇవ్వడం లేదన్న విషయాన్ని గుర్తించడం లేదు. ఎన్నికలలో డబ్బు అవసరం లేకుండా సంస్కరణలు తీసుకు రాకుండా ఎన్ని చర్యలు తీసుకున్నా లాభం లేదు. రాజకీయ పార్టీల ప్రధాన లక్ష్యం అధికారమే కనుక, ఆ అధికారం కోసం ఎంతకైనా తెగబడతాయని ఈ 75 ఏళ్లలో నిరూపితం అయ్యింది. నీతి ఆయోగ్‌ను బలోపేతం చేస్తూ రాష్ట్రాలను విశ్వాసంలోకి తీసుకుని ఉమ్మడిగా ముందుకు సాగాల్సి ఉంది. అప్పుడే దేశం అభివృద్ధి సాధిస్తుందని గుర్తించాలి.




## సాహితీ ప్రేమికులకు ప్రత్యేకం

"ప్రజా మంటలు" తెలంగాణ జాతీయ దినపత్రికలో ప్రతి రోజు ఒక కథను ప్రచురిస్తున్నాం. ముఖ్యంగా బాలల కథలకే ప్రాధాన్యత ఇస్తున్నవిషయాన్ని గమనించి ఉంటారు. ఇందులో ప్రచురించిన కథలలో, ఎంపిక చేసిన వాటిని "యూ ట్యూబ్"లో కూడా పెట్టగలము. కథకులు ఈ విషయాన్ని గమనించి, సంభాషణలు చిన్నవిగా, వర్ణన తక్కువగా, సూటిగా విషయాన్ని చెప్పే కథలను పంపండి. రచయితలు తమ కథలను mantalukathalu@gmail.comకు పంపవచ్చు...

–ఎడిటర్

## భలే కొడుకు!

బలభద్రపురంలో శంకరయ్య అనే కిరాణా వ్యాపారి ఉండేవాడు. అతడు చాలా పిసినారి, మోసకారి ఎందుకు పనికిరాని పారేసే వస్తువులను కూడా ఎవరో ఒకరికి మాయమాటలు చెప్పి అమ్మేసేవాడు! ఆపదలో ఉన్న వారికి కనీస సహాయం కూడా చేసేవాడు కాదు.

శంకరయ్యకు ఒక్కగానొక్క కొడుకు సూర్యం చాలా మంచివాడు అందరితోనూ కలుపుగోలుగా ఉంటూ అందర్నీ పలకరిస్తూ పెద్దలను గౌరవిస్తూ మంచి ప్రవర్తన కలిగి ఉండేవాడు, తెలివైనవాడు కూడా చదువు పూర్తి చేసుకుని ఉద్యోగం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్దాం అనుకున్నా తండ్రి మాట కాదనలేక అతని వద్దే వ్యాపారం చూస్తూ ఉండిపోయాడు.

శంకరయ్య యొక్క విపరీతమైన పిసినారితనం మోసం చేసే స్వభావంతో విసిగిపోయిన ఆ గ్రామ ప్రజలు తరచుగా శంకరయ్యను బహిరంగంగానే తిట్టుకుంటూ ఉండేవారు. సూర్యం ఎన్నో సందర్భాలలో ఎందుకు ఇటువంటి పనులు అని నచ్చచెప్పి ప్రయత్నం చేసేవాడు కానీ శంకరయ్య వినేవాడు కాదు "నీకు తెలియదు లేరా నువ్వు ఊరుకో" అంటూ కొడుకును విసుక్కునేవాడు.



కొంత కాలం గడిచింది అనారోగ్యంతో శంకరయ్య మంచం పట్టాడు కొట్టు బాధ్యత పూర్తిగా సూర్యం మీద పడింది ఒకరోజు శంకరయ్య కొడుకుని పిలిచి " నా ఆరోగ్యం బాగా క్షీణిస్తోంది నేను ఇంకా ఎక్కువ కాలం బ్రతకలేను నేను ఈ ఊరివారిని చాలా ఇబ్బంది పెట్టాను వాళ్ళ ను బాగా మోసం చేశాను నువ్వు ఎన్నో సార్లు అలా చెయ్యొద్దు అని చెప్పి నా వినలేదు నన్ను క్షమించు " అంటూ కళ్ళంపట నీళ్లు పెట్టుకున్నాడు. భలే వాడివి నాన్న ..అవన్నీ ఇప్పుడు ఎందుకు హాయిగా విశ్రాంతి తీసుకోండి" అన్నాడు సూర్యం " కాదురా.. నేను చాలా పొరపాటు చేశాను నాకు ఇప్పుడు తెలిసి వచ్చింది అంటూ నా చివరి కోరిక ఒకటి ఉంది దానిని తీరుస్తావా?" అని అడిగాడు "చెప్పు నాన్న ఏమిటో అది తీరుస్తాను" అన్నాడు. "ఈ ఊర్లో దాదాపు అందరూ నన్ను తిట్టుకునే వారే అది నాకు తెలుసు కానీ ఈ ఊరి వారే నన్ను గొప్ప వాడని మెచ్చుకోవాలి ఆ విధంగా చేయాల్సి బాధ్యత నీదే" అన్నాడు "సరే అలాగే ముందు మీ ఆరోగ్యం నయం కానీయండి" అన్నాడు సూర్యం ఆ తర్వాత కొన్ని రోజులకే కన్నుమూశాడు శంకరయ్య.

కొన్ని రోజుల తర్వాత శంకరయ్య సంస్మరణ సభను ఏర్పాటు చేశాడు సూర్యం. ఆ సభలో తన తండ్రిని అందరూ పొగుడుతారని తన తండ్రి చివరి కోరిక నెరవేరుతుందని అతని .ఆశ కానీ వచ్చిన వారందరూ కూడా తన తండ్రి ని పొగడలేదు కేవలం "చనిపోవడం బాధాకరం, ఆత్మకు శాంతి కలగాలని" అనే ముక్తసరి మాటలతో ముగించారు.

ఒకరోజు శంకరయ్య సూర్యానికి కలలో వచ్చి "ఏరా నన్ను అందరూ తిట్టుకుంటూనే ఉన్నారు.నన్ను ఎవరూ గొప్పవాడు అని పొగడటం లేదు నేను నీకు చెప్పిన పని ఏమి చేశావు ?" అనగానే సూర్యానికి ఏం చేయాలో అర్థం కాలేదు. సమస్యను వాళ్ళ నాన్న మిత్రుడైన కనకయ్య కు చెప్పగా అయితే ఒక పని చెయ్యి ఏదైనా పాఠశాలకు వెళ్లి అక్కడ పిల్లలకి మీ నాన్న గారి పేరు మీద పుస్తకాలు పెన్నులు ఇతర వస్తువులు వారికి అందజేయి అప్పుడు మీ నాన్న గారిని అందరూ గొప్పగా పొగుడుతారు అనగా ఊర్లో ఉన్న పాఠశాలకు వెళ్లి అక్కడ విద్యార్థులకు పుస్తకాలు పెన్నులు వారికి ఉపయోగపడే వివిధ వస్తువులు అందజేశారు అక్కడ ఉపాధ్యాయులూ తల్లిదండ్రులు అందరూ సూర్యాన్ని ఎంతగానో పొగిడారు తప్పితే వారి నాన్నను ఏం మాత్రం పొగడలేదు. లాభం లేదని ఒక పండగ నాడు ఊరిలో వారందరికీ వాళ్ల నాన్న పేరు మీద భోజనాలు ఏర్పాటు చేశాడు. వచ్చిన వారందరూ భోజనం చేసి సూర్యాన్ని మెచ్చుకుని దీవించి వెళ్లారు తప్పితే వాళ్ల నాన్నను ఏ మాత్రం పొగడలేదు. ఏం పని చేసినా అది అతని గొప్పతనం గానే భావిస్తున్నారు కానీ వాళ్ల నాన్నకు అది ఆపాదించడం లేదు! ఏం చేయాలో అర్థం కాలేదు సూర్యానికి. ఒకరోజు రాత్రంతా నిద్ర లేకుండా ఆలోచించగా ఒక ఉపాయం తట్టింది ఎలాగైనా దాని అమలు చేసి తన తండ్రిని గొప్ప వాడిగా ఊరు వారందరూ మెచ్చుకోవాలని తన తండ్రి చివరి కోరికను తీర్చాలని భావించాడు.

మరుసటి రోజు దుకాణానికి వచ్చిన వారందరితోను విచిత్రంగా వ్యవహరించడం వారితో సరిగ్గా మాట్లాడకపోవడం వారిచ్చిన డబ్బుకి సరైన వస్తువు ఇవ్వకుండా కొంత డబ్బు కావాలని మర్చిపోయినట్లు నటించడం తప్పుడు. లెక్కలు వేయడం వంటి పనులు చేయసాగాడు ఒక్కసారిగా అందరూ ఆశ్చర్యపోయారు ఎప్పుడు లేనిది సూర్యం ఏంటి ఇలా మారిపోయాడు ఏమైంది అనుకున్నారు కొన్ని రోజులు గడిచాయి కొంతమంది బహిరంగంగానే శంకరయ్యే నయం ఏదో చిన్నగా మోసం చేసేవాడు సూర్యం ఈ మధ్యకాలంలో వాళ్ళ నాన్న కన్నా ఘోరంగా తయారయ్యాడు వాళ్ళ నాన్నే నయం అని అందరూ ముక్త కంఠంతో శంకరయ్యను పొగడ సాగారు. ఇదంతా పైనుంచి గమ నిస్తున్న శంకరయ్య ఆనందంతో పొంగిపోయాడు.

ఒకరోజు కనకయ్య వచ్చి "ఏమి సూర్యం నీ గురించి ఊర్లో అందరూ చెడ్డగా చెప్పుకుంటున్నారు ప్రవర్తనలో మార్పు వచ్చిందని ఊర్లో అందరూ నిన్ను తిట్టుకుంటున్నారు నేను అసలు నమ్మలేదు" అనగా "దానికి కారణం మా నాన్న మా నాన్నను గొప్పగా పొగడ పోవడానికి కారణం అతను ఏ మంచి పని చేయలేదు అందుకని అతనికంటే దరిద్రమైన పనులు చేస్తేనే అతన్ని పొగుడతారని భావించి ఆ విధంగా చేశాను. ఈ విధంగా చేయటం తప్పని నాకు తెలిసిన తప్పని పరిస్థితి లో మా నాన్న చివరి కోరిక తీర్చాలని అందరూ మా నాన్నని మెచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో అలా ప్రవర్తించాను ఊరి వారందరూ మా నాన్నను పొగడటంతో నాన్న ఆత్మ కు శాంతి కలిగిందని భావిస్తూన్నాను. ఇకనుంచి అందరితో మంచిగా ఉంటాను నా సహజ ప్రవర్తనతో ప్రవర్తిస్తాను" అనగా కనకయ్య " మీ నాన్న మీద నీకున్న ప్రేమ ఎంతో గొప్పది మీ నాన్న కోసం నువ్వు మాటలు పడటానికి అయినా సిద్ధపడి నీకు నచ్చని పనులు కూడా చేశావు నువ్వు నిజమైన పుత్రుడవు " అంటూ ఈ విషయాన్ని గ్రామస్తులకు కూడా తెలిపాడు కనకయ్య. తండ్రి కోసం ఊరి వారందరితో మాటలు పడ టానికి సైతం సిద్ధపడి నందుకు గానూ గ్రామస్తులు కూడా సూర్యాన్ని ఎంతగానో మెచ్చుకున్నారు.

– ఏడుకొండలు కళ్ళేపల్లి
మచిలీపట్నం, 9490832338

## తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో 19న హరితోత్సవం

### పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి ఇంద్రకరణ్

**హైదరాబాద్,జూన్5:** తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈ నెల 19న హరితోత్సవాన్ని రాష్ట్రమంతా ఘనంగా నిర్వహించాలని అటవీశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి పిలుపునిచ్చారు. సచివాలయంలో హరితోత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను అటవీశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. గత తొమ్మిదేళ్లుగా హరితహారంలో భాగంగా అమలు చేస్తున్న ప్రత్యేక కార్యక్రమాలు, విజయాలను వివరించే రెండు పోస్టర్లును అటవీశాఖ తయారు చేసింది.÷ద్ద ఎత్తున కోట్లాది మొక్కలు నాటడం, రహదారి వనాలు, ప్లలె ప్రకృతి వనాలు, అర్బన్ పార్కుల ఏర్పాటు, అటవీ పునరుద్ధరణలో భాగంగా అడవుల లోపల చేపట్టిన కార్యక్రమాలను పోస్టర్లలో పొందుపరిచారు. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రతి గ్రామం, పట్టణం, ప్రభుత్వ కార్యాలయాల్లో హరితహారం విజయాలను ప్రదర్శించేందుకు అటవీశాఖ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి వెల్లడించారు. జూన్ 19న హరితోత్సవం సందర్భంగానే తొమ్మిదో విడత హరితహారం ప్రారంభమవుతుందని మంత్రి తెలిపారు. ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటాలని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటు ఎంత ప్రత్యేకమో.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ అమలు చేస్తున్న పథకాలు అంతే విశిష్టత కలిగి ఉన్నాయన్నారు. 33శాతం పచ్చదనం సాధన కోసం అమలు చేస్తున్న తెలంగాణకు హరితహారం జాతీయ స్థాయి ప్రశంసలు అందుకుంటోందన్నారు. ఈ పథకానికి దక్కుతున్న ప్రతి అవార్డు, గుర్తింపులో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం ఉందని, ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పచ్చదనం పెంపునకు అందరూ పునరంకితం కావాలని మంత్రి పిలుపునిచ్చారు.




## సైద్ధాంతిక నిబద్ధతకు నిలువుటద్దం చంద్ర రాజేశ్వరరావు

### జూన్ 6... చంద్ర రాజేశ్వరరావు జయంతి

నమ్మిన సిద్ధాంతాలకు కట్టుబడి, ఏళ్ళతరబడి ఉద్యమాల్లో, అజ్ఞాత వాసంలో గడిపిన అలుపెరుగని కమ్యూనిస్టు నిస్వార్థ పోరాట యోధుడు చంద్ర రాజేశ్వరరావు. కమ్యూనిస్టు పార్టీకి ఆరున్నర దశాబ్దాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన నిబద్ధత కలిగిన మహా నేత రాజేశ్వరరావు.

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)కి 28 సంవత్సరాల సుదీర్ఘ కాలం నేతృత్వం వహించిన రాజేశ్వరరావు జీవితం సైద్ధాంతిక నిబద్ధతకు, నిజాయితీకీ నిలువుటద్దం. చంద్ర రాజేశ్వరరావు భారత కమ్యూనిస్టు పార్టీ తొలితరం అగ్రనాయకుల్లో ఒకరు. పేరుకు తగినట్టుగానే ప్రత్యర్థులపై చంద్ర ప్రచండత్వం ప్రదర్శించేవారు.

తెలంగాణ సాయుధ పోరాట యోధులతో మమేకమైన కమ్యూనిస్టు ఆయన. ఎంతటి వారితో నైనా తన అభిప్రాయాలను నిక్కచ్చిగా వెల్లడించేవారు. నెహ్రూ, ఇందిరాగాంధీలు తీసుకున్న నిర్ణయాల్లో ప్రజోపయోకరాలను సమర్థించినా, నిరంకుశ చర్యలను వ్యతిరేకించిన నిష్పక్షపాతి ఆయన.

పీడిత, తాడిత జనోద్ధరణ కోసం ఎంతో ఉజ్వలమైన భవిష్యత్‌ను వదులు కుని కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో ప్రముఖ పాత్ర వహించిన ఆయన పేదల హృదయాల్లో చిర స్థాయిగా నిలిచారు. పుచ్చలపల్లి సుందరయ్య, మాకినేని బసవపున్నయ్య, తరిమెల నాగిరెడ్డి, నీలం రాజశేఖరరెడ్డి, తదితర



పార్టీ అగ్రనాయకులతో కలిసి, దశాబ్దాల పాటు రాష్ట్రంలోనే కాక, దేశంలోని పలు ప్రాంతాల్లో కమ్యూనిస్టు పార్టీని బలోపేతం చేయడానికి అహర్నిశలు కృషి చేశారు.

కృష్ణా జిల్లా చల్లపల్లి మండలంలోని మంగళాపురం గ్రామంలో 1914 జూన్ ఆరవ తేదీన పెద్ద భూస్వాముల కుటుంబంలో జన్మించిన రాజేశ్వరరావు కమ్యూనిస్టు పార్టీలో చేరిన తరువాత ఆ భూస్వాములకు వ్యతిరేకంగా, భూమి లేని నిరుపేదల తరఫున దశాబ్దాలపాటు పోరాటం జరిపారు.

రాజేశ్వరరావు ప్రాథమిక విద్యాభ్యాసం మంగళాపురంలో, సెకండరీ విద్య చల్లపల్లిలోనూ సాగింది. బందరు హిందూ స్కూలులో ఎస్సెస్సెల్సీ పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే రాజే శ్వరరావు క్రీడాకారునిగా, పేదల పాలిట ఆత్మీయునిగా పేరొం దారు. మహాత్మా గాంధీ పిలుపుపై సాగిన ఉప్పు సత్యాగ్రహంలో వలంటీర్‌గా పని చేశారు. యుక్తవయసులోనే విప్లవ భావాల పట్ల ఆకర్షితులయ్యారు. మహాత్మాగాంధీ ఉద్యమాల్లో పనిచేస్తున్నా, విప్లవ కిశోరాలైన భగత్‌సింగ్, రాజగురు, సుఖదేవ్ వంటివారి పట్ల ఆరాధనా భావాన్ని పెంచుకున్నారు. బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకుంటున్న రోజుల్లోనే ఆయన హిందూ, ముస్లిం ఐక్యత కోసం ఎంతోకృషి చేశారు. కమ్యూనిస్టు నాయకులను ఆనాటి బ్రిటిష్ ప్రభుత్వం మీరట్ కుట్ర కేసులో ఇరికించి జైళ్ళలో పెట్టినప్పుడు వారు విడుదల చేసిన ప్రకటన రాజేశ్వరావును ఉత్తేజపర్చింది. వామపక్ష భావాలున్న విద్యార్థులందరినీ ఐక్యపర్చి సాటి విద్యార్థులతో కలిసి ఒక స్టడీ సర్కిల్‌ని ఏర్పాటు చేశారు. తరువాత అది 'యంగ్ కమ్యూనిస్టు లీగ్'గా అవతరించింది.

బెనారస్ హిందూ యూనివర్శిటీలో చదువుకునే రోజుల్లోనే మతవాద, మితవాద వర్గాలను ధైర్యంగా ఎదుర్కొన్న ధీశాలి రాజేశ్వరరావు. తరచుగా ఘర్షణలకు దిగడం, కమ్యూనిస్టు వర్గానికి నాయకత్వం వహించడంతో బిఎస్సీ పూర్తి కాకముందే ఆయన యూనివర్శిటీ నుంచి టీసీ తీసుకుని బయటికి వచ్చారు. బెనారస్‌లో ఉండగానే ఆయన లక్నోలో జరిగిన భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు హాజరయ్యారు. జవహర్‌లాల్ నెహ్రూ సోవియట్ రష్యా సందర్శించి వచ్చిన తరువాత సోషలిజం, స్వాతంత్ర్య పోరాటంలో కార్మిక, కర్షక పాత్ర, వర్గ సంఘాలు, వర్గ పోరాటాల పేరిట రాసిన వ్యాసాలు రాజేశ్వరరావును విశేషంగా ఆకర్షించాయి.అదే సందర్భంలో ఆయన మహాత్మా గాంధీని కలిసిన విద్యార్థి బృందంలో ఉన్నారు. తరువాత ఆయన విశాఖలో మెడిసిన్‌లో చేరినా, ఆయన కమ్యూనిస్టు భావాల ప్రచారానికి నిడమర్తి ఉమారాజేశ్వరరావు ప్రభృతులతో కలిసి స్టడీ సర్కిల్స్ ఏర్పాటు చేశారు. కమ్యూనిస్టు భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ఉద్యమంలో చురుకుగా పాల్గొనడం వల్ల ఆయన చదువు బెనారస్‌లోనూ, విశాఖలోనూ సవ్యంగా సాగలేదు.

తండ్రి అభిమతానికి వ్యతిరేకంగా ఆయన సావిత్రమ్మతో వివాహాన్ని అతి నిరాడంబరంగా దండల మార్పుతో చేసుకున్నారు. వారి వివాహానికి ప్రముఖ స్వాతంత్ర్య యోధుడు మద్దూరి అన్నపూర్ణయ్య పెళ్ళిపెద్దగా వ్యవహించారు. సావిత్రమ్మ కూడా భర్త మార్గంలోనే కమ్యూనిస్టు ఉద్యమం ప్రచారం కోసం జీవితాంతం కృషిచేశారు. వివాహానికి గుర్తుగా మెడలో వేసుకున్న గొలుసు రాయిని తీయించి ఎర్ర నక్షత్రాన్ని వేసుకోవడం ఆమె నిబద్ధతకు నిదర్శనం. పార్టీ నిర్ణయం మేరకు పూర్తి కాల కార్యకర్తగా పనిచేయడం కోసం ఆమె శాంతినికేతన్‌లో చదువు కోవాలనే ఆకాంక్షను బలవంతంగా అణగ దొక్కుకున్నారు.

కృష్ణా జిల్లాలో కమ్యూనిస్టుపార్టీ విస్తరణకు రాజేశ్వరరావు దంపతులు విశేషంగా కృషిచేశారు. కార్మిక, కర్షక సంఘాలను ఏర్పాటు చేసి, మంగళాపురం కూలీల పోరాటానికి, చల్లపల్లి జమిందారు అక్రమాలపై ఉద్యమానికి నేతృత్వం వహించారు. కృష్ణాజిల్లా తిరువూరు తాలూకాలో నైజాం సరిహద్దున ఉన్న తునికిపాడుకు వచ్చిన రావి నారాయణరెడ్డి, బద్దం ఎల్లారెడ్డి ప్రభృతులు నైజాంలో పరిస్థితి గురించి వివరించారు. ఆ క్రమంలోనే రాజేశ్వరరావుకు... ఆరుట్ల లక్ష్మీనరసింహారెడ్డి, రామచంద్రారెడ్డి, దేవులపల్లి వెంకటేశ్వరరావు, చిర్రావూరి లక్ష్మీనరసయ్య ప్రభృతులు కూడా రావడంతో వారందరితో రాజేశ్వరరావుకు పరిచయాలు ఏర్పడ్డాయి. క్రమంగా తెలంగాణాలో అనేకసార్లు పర్యటించి తెలంగాణలో పార్టీ నిర్మాణానికీ, భువనగిరి ఆంధ్ర మహాసభ నిర్వహణకు తోడ్పడ్డారు. తెలంగాణా కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకులను సమన్వయ పర్చడంలో,సాయుధ పోరాటంలో కీలకపాత్ర వహించారు.

భారత విప్లవోద్యమం గురించి స్టాలిన్‌తో చర్చించేందుకు అజయ్ ఘోష్, ఎస్ఏ డాంగే, బసవ పున్నయ్యలతో పాటు రాజేశ్వరరావు మాస్కో వెళ్ళారు. రాజేశ్వరరావు ఎంత పెద్ద నాయకుడైనా ఏమాత్రం అభిజాత్యాన్ని ప్రదర్శించకుండా, నిరంతరం ఏదో తెలుసు కోవాలనే తపనతో ఉండేవారు. పుచ్చలపల్లి సుందరయ్య పట్ల ఎంతో గౌరవం ఉన్నా, అవిభక్త కమ్యూనిస్టు పార్టీ చీలినప్పుడు ఆయన భారత కమ్యూనిస్టు పార్టీకి నేతృత్వం వహించారు. రాజేశ్వరరావు సిద్ధాంతాలతో ఏనాడూ రాజీ పడలేదు. ఇందిర ప్రభుత్వం తీసుకున్న ప్రగతి శీల చర్యలకు మద్దతు ఇస్తూనే, ఆమె నిరంకుశ పోకడలను తీవ్రంగా వ్యతిరేకించే వారు. 1970వ దశకంలో దేశవ్యాప్తంగా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యంలో సాగిన భూ ఆక్రమణ ఉద్యమం పార్టీ ప్రతిష్ఠను పెంచి, అందరి దృష్టిని ఆకర్షించింది. ఆ ఉద్యమం విజయవంతం కావడంలో రాజేశ్వరరావు పాత్ర గణనీయం. ఆయన పిత్రార్జిత ఆస్తిలో తన వాటాను పూర్తిగా పార్టీకోసం వెచ్చించారు. పార్టీకి ఆయన విరాళంగా ఇచ్చిన లక్షలాది రూపాయిలతో ఆరోజుల్లో వందలాది ఎకరాలను కొనగలిగి ఉండేవారనేది వాస్తవం.

ఆయన ఢిల్లీ వెళ్ళినా,ఎక్కడికి వెళ్ళినా పార్టీ కార్యాలయాల్లోనే బస చేయడం, తన బట్టలను తానే ఉతు క్కోవడం నిరాడంబర జీవితం తానికి ప్రబల నిదర్శనాలు. అక్టోబర్ విప్లవం 60వ వార్షికోత్సవాల సందర్భంగా భటిండాలో జరిగిన పార్టీ మహాసభలో ఆమోదించిన తీర్మానం చరిత్రాత్మకమైనది. రాజేశ్వరరావు సోవియట్ యూనియన్‌లో గోర్బాచెవ్ ప్రవేశపెట్టిన సహకార వ్యవసాయం, కాంట్రాక్ట్ సేద్య విధానాలను రాజేశ్వరరావు సమర్థించారు.

సోవియట్ యూనియన్ కుప్పకూలిన తరువాత సంభవించిన పరిణామాల పట్ల ఆయన చివరి రోజుల్లో ఎంతో కలత చెందారు.

ప్రపంచంలో ఎక్కడ ప్రగతి శీల పోరాటాలు జరిగినా వాటికి ఆయన మద్దతు ప్రకటించేవారు. ఉభయ కమ్యూనిస్టు పార్టీలు అనేక సమస్యలపై ఒకే అభిప్రాయాన్ని కలిగి ఉన్నప్పటికీ, సిపిఎం వ్యతిరేక ధోరణి వల్ల ఉభయ కమ్యూనిస్టు పార్టీల పునరేకీకరణ ప్రక్రియ ఆలస్యమవుతోందని ఆవేదన చెందేవారు.

ఆయన ఎన్నో పురస్కారాలను పొందినా,1994 లో పొందిన సోవియట్ యూనియన్ ఆర్డర్ ఆఫ్ లెనిన్ పురస్కారం అత్యంత ప్రతిష్ఠాకరమైనది. సుదీర్ఘకాలం పార్టీకోసం అహర్నిశలు కృషిచేసిన రాజేశ్వరరావు 80 వ ఏట 1994 ఏప్రిల్ 9వ తేదీన హైదరాబాద్‌లో కన్నుమూశారు.



–ఆర్కె సంగనభట్ల
9440595494



# పారిశ్రామిక వేత్త అదానీ పెద్ద మనసు

### రైలు ప్రమాద మృతుల కుటుంబాలకు భరోసా

### అనాధలైన పిల్లలకు చదువు ఖర్చు భరిస్తానని ప్రకటన

**ముంబై,జూన్6(ప్రజా మంటలు):** గత మూడు దశాబ్దాల్లో అత్యంత ఘోరమైన రైలు ప్రమాదంగా నిలిచింది ఒడిశా రైలు ప్రమాదం. ఈ దుర్ఘటనలో 277 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. దాదాపు వెయ్యి మంది తీవ్రంగా గాయపడి ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అందులో పలువురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా తీవ్ర విషాదం నింపింది ఈ రైలు ప్రమాదం. ఎంతో మంది తమ వారిని కోల్పోయారు. చిన్నా పెద్దా చాలా మంది చనిపోయారు. గుండెలవిసే రోదనలు ఆ ప్రాంతంలో మిన్నంటింది. ఈ ప్రమాదంలో పలువురు చిన్నారులు తమ తల్లిదండ్రులు ఇద్దరినీ కోల్పోయి అనాథలుగా మారారు. ఇలాంటి దుర్భర పరిస్థితిలో తన వంతు సాయం చేసేందుకు దిగ్గజ పారిశ్రామిక వేత్త గౌతమ్ అదానీ ముందుకొచ్చారు. ఈ దుర్భర స్థితిలో మరోసారి తన దాతృత్వాన్ని చాటుకున్నారు. ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదంలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారుల చదువు బాధ్యతను తాము తీసుకుంటామని గౌతమ్ అదానీ ప్రకటించారు. వారి చదువుకు అయ్యే ఖర్చునంతా తామే భరిస్తామన్నారు. ఉచితంగా విద్యను అందించి వారికి మంచి భవిష్యత్ కల్పిస్తామని చెప్పారు. ఈ మేరకు గౌతమ్ అదానీ ట్వీట్ చేశారు. 'ఒడిశాలో జరిగిన రైలు ప్రమాదంతో అందరం తీవ్రంగా కలత చెందాం. ఈ ఘోర దుర్ఘటనలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలకు పాఠశాల విద్యను అందించాలని అదానీ గ్రూప్ నిర్ణయించుకుంది. బాధితులను ఆదుకోవడం మనందరి ఉమ్మడి బాధ్యత. వారి కుటుంబాలకు, పిల్లలకు మంచి భవిష్యత్ అందించండి' అంటూ గౌతమ్ అదానీ తన ట్వీట్ లో పేర్కొన్నారు. ఒడిశా రైల్వే ప్రమాదంపై ఉన్నతాధికారులు కీలక వివరాలు వెల్లడించారు. ఇప్పటికే రైల్వేమంత్రి అశ్వినీ వైష్ణవ్ 'ఎలక్ట్రానిక్ ఇంటర్‌లింకింగ్ సిస్టమ్'లో లోపం వల్ల ప్రమాదం జరిగిందని ప్రాథమికంగా తెలిపారు. రైల్వే బోర్డ్ అధికారులు దీనిపై మరికొన్ని వివరాలు అందించారు.

# మాదాపూర్‌లో నూతన ట్రాఫిక్ డిసిపి కార్యాలయం

### ప్రారంభించిన సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

**హైదరాబాద్,జూన్5(ప్రజా మంటలు):** గచ్చిబౌలిలోని మాదాపూర్ డిసిపి ఆఫీసులోని మూడవ అంతస్తులో నూతనంగా నిర్మించిన మాదాపూర్ ట్రాఫిక్ డిసిపి కార్యాలయం,అదనపు ట్రాఫిక్ డిసిపి కార్యాలయాన్ని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ శ్రీ స్టీఫెన్ రవీంద్ర సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపి



మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన డిసిపి, ఏడిసిపి కార్యాలయంలో అన్ని మౌలిక వసతులు కల్పించామన్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ కు అనుగుణంగా నూతనంగా కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లను నార్సింగి, మేడ్చల్, రాయదుర్గం అర్ సి పురం ఏర్పాటు చేశామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు ట్రాఫిక్ టాస్క్ ఫోర్స్ వంటి పటిష్టమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యంలో వాహనదారులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సిబ్బంది పని చేయాలన్నారు. అలాగే రాయదుర్గం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను మాదాపూర్ మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి హనుమంతరావు రాయదుర్గం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ మరియు సిబ్బంది సమక్షంలో ప్రారంభించారు. సిపి వెంట ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ నాయక్, మాదాపూర్ లాం అండ్ ఆర్డర్ డిసిపిశిల్పవల్లి, ఏడీసీపీ నంద్యాల నరసింహారెడ్డి, ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ శ్రీనివాస్ రెడ్డి, గచ్చిబౌలి ఇన్స్పెక్టర్ సురేష్, మాదాపూర్ ట్రాఫిక్ ఏసిపి హనుమంతరావు, గచ్చిబౌలి ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ నవీన్, మాదాపూర్ ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ నరసయ్య, రాయదుర్గం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

# ముందుగా శబ్దం వచ్చింది

### లోకో డ్రైవర్ వెల్లడించినట్లు సమాచారం

**భువనేశ్వర్,జూన్6(ప్రజా మంటలు):** ఒడిశా రైలు ప్రమాదంపై ఓ వైపు విచారణ జరుగుతుండగానే కీలక వివరాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రమాదం జరిగిన తరవాత ఏం జరిగిందో కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ వివరించినట్టు రైల్వే బోర్డ్ వెల్లడించింది. యాక్సిడెంట్ అయిన కాసేపటి వరకూ స్పృహలో ఉన్నట్టు తెలిపింది. ప్రమాదం జరిగే ముందు గ్రీన్‌సిగ్నల్ వచ్చిందని, అందుకే ఆగకుండా వెళ్లిపోయానని డ్రైవర్ చెప్పినట్టు అధికారులు స్పష్టం చేశారు. రైల్వే బోర్డ్ సభ్యురాలు జయ వర్మ చెప్పిన వివరాల ఆధారంగా చూస్తే...లోకోపైలట్‌తో రైల్వే బోర్డ్



అధికారులంతా మాట్లాడారు. రెడ్ సిగ్నల్ పడకపోవడం వల్ల వేగంగా దూసుకొచ్చినట్టు లోకోపైలట్ చెప్పినట్టు వివరిస్తున్నారు. 'ట్రైన్‌ని ఆపాలని ఎవరూ సమాచారం ఇవ్వలేదు. రెడ్ సిగ్నల్ కూడా లేదు. అందుకే వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదం జరిగిన కాసేపటి వరకూ డ్రైవర్ స్పృహలో ఉన్నా...ఆ తరవాత ఉన్నట్టుండి కిందపడిపోయాడు. పరిస్థితి విషమించడం వల్ల ఆసుపత్రికి తరలించాం. ప్రస్తుతానికి చికిత్స అందిస్తున్నారు. పైలట్ పేరు మోహంతి. అతనితో పాటు కోపైలట్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదం జరిగిన సమయంలో వెనక నుంచి ఏదో వింత శబ్దాలు వినిపించాయని.. కానీ అదేంటో గుర్తించేలోపే ప్రమాదం జరిగిపోయిందన్నారు. కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ గూడ్స్ ట్రైన్‌ని ఢీకొట్టిన సమయంలో లోపల గార్డ్ లేడు. అందుకే ప్రాణాలతో బయటపడ్డాడు. రైల్వే నిబంధనల ప్రకారం...గూడ్స్ గార్డ్‌తో పాటు డ్రైవర్ ట్రైన్‌ని ఎక్కడ పార్క్ చేసే విషయంలో చాలా అప్రమత్తంగా ఉండాలి. ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకునే బాధ్యత వాళ్లదే. కానీ...ఆ సమయంలో అక్కడ వాళ్లు లేకపోవడమూ విమర్శలకు దారి తీసింది.

# రాష్ట్రం ఏర్పడే నాటికి 2700 మెగావాట్ల విద్యుత్ లోటు

### 9 ఏండ్లల్లో మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ - విద్యుత్ విజయం అంతా సీఎం కేసీఆర్ ప్రతిభే - విద్యుత్ విజయోత్సవ సభలో మంత్రి ఎర్రబెల్లి

**వరంగల్,జూన్5 (ప్రజా మంటలు):** చీకట్లో మగ్గిపోతున్న రాష్ట్రాన్ని వెలుగు జిలుగుల తెలంగాణగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ కే దక్కుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 2700 మెగావాట్ల విద్యుత్ లోటు





నుంచి రాష్ట్రం ఏర్పాటైన 9 ఏండ్లల్లో మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని అన్నారు. ఇంత తక్కువ కాలంలో ఇంత ఎక్కువగా పని చేసి, దేశంలోనే విద్యుత్ వినియోగంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్రం వస్తే చీకట్లో మగ్గుతారని అన్న అప్పటి సీఎం ఇప్పటి వరకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ విజయం ప్రతిభ అంతా సీఎం కేసీఆర్ కే చెందుతుందని, అకుంఠిత దీక్ష, దక్షతలతో నిరంతరం శ్రమించి, తెలంగాణలో కోతలు లేని, హాలీడేలు లేని, నాణ్యమైన 24 గంటల విద్యుత్ ని నిరంతరాయంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పాలకుర్తిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి, అనంతరం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన విద్యుత్ విజయోత్సవ సభలో మంత్రి మాట్లాడారు.

విద్యుత్ లోటు, నిరంతర కోతలు, పవర్ హాలీడేలు, కరెంటు లేక పంటలు ఎండిపోయే దుస్థితి నుండి నేడు రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్యుత్ మిగులు రాష్ట్రంగా అభివృద్ధి చెందిందని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. అభివృద్ధికి సూచికగా, ఇవ్వాళ తలసరి విద్యుత్ వినియోగంలో 1196 యూనిట్లతో దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వం అందించిన సబ్సిడీల సహకారం రూ.50వేల కోట్లకు పైగా ఉందని అన్నారు. రాష్ట్రంలో 27లక్షల 10వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రైతుల తరపున ఇతర అన్ని రకాల సబ్సిడీగా 50వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ సహకారం అందించిందని మంత్రి వెల్లడించారు. ఒక్కో మోటారుకు లక్షా 20వేల సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించిందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 5 వేల 830 ట్రాన్స్ ఫార్మర్లు ఉండగా 99 కోట్ల 93 లక్షల రూపాయల తో ఏర్పాటు చేశారు,

కాని తెలంగాణ ఏర్పడిన తరువాత అదనంగా 2 వేల 500 కొత్త

గతంలో కేవలం 49వేల కోట్లు మాత్రమే చెల్లిస్తే, ఇప్పుడు 883 కోట్లు సబ్సిడీగా ప్రభుత్వం చెల్లించందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 87వేల 980 మంది రైతులకు 880 కోట్ల 4 లక్షలు సబ్సిడీగా చెల్లించినట్లు వివరించారు. అలాగే రజకులకు ఆర్థికంగా తోడ్పాటుకు పాలకుర్తి నియోజకవర్గానికి 501 రజక సర్వీసులకు 250 యూనిట్లు ఉచితంగా ఇస్తూ, ఇప్పటి వరకు 16 లక్షల 66 వేల రూపాయలు అందించడం జరిగింది. 246 నాయీబ్రాహ్మణ సర్వీసులకు గాను 250 యూనిట్లు ఉచితంగా ఇస్తూ, ఇప్పటివరకు 36 లక్షల 62 వేల రూపాయల సబ్సిడీ అందించాము. ÷ూఅ/÷ు విద్యుత్ వినియోగదారులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద 887 సర్వీసులకు ఇప్పటి వరకు 3 కోట్ల 73 లక్షల రూపాయలు అందించడం జరిగింది. నాడు పాలకుర్తి నియోజకవర్గంలో 27 సబ్ స్టేషన్లు మాత్రమే ఉండగా తెలంగాణ ఏర్పడిన తరువాత అదనంగా 14 సబ్ స్టేషన్లు 25 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నాము. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 32 వేల 624 కనెక్షన్లకు 149 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించడం జరిగింది, కాని తెలంగాణ ఏర్పడిన తరువాత అదనముగా 8 వేల 275 సర్వీసులు మంజూరు చేసి మొత్తం ఈ 10 ఏళ్లలో 883 కోట్ల 73

ట్రాన్స్ ఫార్మర్లు 37 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నాము. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 71 వేల 712 కరెంటు పోల్స్ 29 కోట్ల 56 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయగా, తెలంగాణ ఏర్పడిన 9 సంవత్సరాల కాలంలో అదనంగా 61 వేల 412 కరెంటు పోల్స్ ను 25 కోట్ల 30 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వివరించారు.

నిజాలు ఇలా ఉండగా, కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తూ, ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటివాళ్ళు ఊళ్ళకు వస్తే, వారిని నిలదీయాలని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు మంత్రి ఎర్రబెల్లి పిలుపునిచ్చారు. జిల్లా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ.. విద్యుత్ ఉత్పత్తితోపాటు, వినియోగంలోనూ మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా ఉందన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావులు కలిసి అటు రాష్ట్రాన్ని, ఇటు పాలకుర్తి నియోజకవర్గాన్ని అద్భుతంగా విద్యుత్ రంగంలో తీర్చిదిద్దారన్నారు. అంతకుముందు మంత్రికి విద్యుత్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమాల్లో విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ వ్యాప్తంగా తరలి వచ్చిన పార్టీ నేతలు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# సింగరేణిని కాపాడిన ఘనత కేసీఆర్‌దే

### వారసత్వ ఉద్యోగాల హామీని నెరవేర్చాం

### దశాబ్ది ఉత్సవాల సందర్భంగా కార్మికులకు కవిత శుభాకాంక్షలు

**హైదరాబాద్,జూన్6(ప్రజా మంటలు):** తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాతే సింగరేణి కార్మికులకు గొప్ప ఫలితాలు అందుతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అన్నారు. అమ్మలాంటి సింగరేణిని కాపాడుకున్న గొప్పతనం ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని అన్నారు. సింగరేణి వారసత్వ ఉద్యోగాలకు వ్యతిరేకంగా అనేక మంది ప్రయత్నాలు చేసినా, సీఎం కేసీఆర్ పట్టుదలతో వారసత్వ ఉద్యోగాలు అందిస్తున్నారని కొనియాడారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం వచ్చాక కార్మికుల సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. సింగరేణి సంస్థను కాపాడుతున్న గొప్ప నాయకుడు సీఎం కేసీఆర్ అని ఎమ్మెల్సీ కవిత మరొకసారి వ్యాఖ్యానించారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా సింగరేణి సంబరాలు జరుపుకుంటున్న సింగరేణి బొగ్గు గని కార్మికులకు, వారి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సింగరేణి కార్మికులకు ఇంక్రిమెంట్లతో పాటు,చిరకాల వాంఛ అయిన డిపెండెంట్ ఉద్యోగాలను సైతం సాధించుకున్నా మని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. డిపెండెంట్ ఉద్యోగాలు రాకుండా అనేక వ్యక్తులు, శక్తులు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, సీఎం కేసీఆర్ కార్మికుల మంచికోరే వ్యక్తిగా కారుణ్య నియామ పక్రియ ద్వారా ప్రతినెలా ఉద్యోగులను తీసుకుంటున్నారన్న ఎమ్మెల్సీ కవిత, ఇప్పటిదాక దాదాపు 15 వేల



వారసత్వ ఉద్యోగాలు ఇవ్వడం జరిగిందన్నారు. వారసత్వ ఉద్యోగాలు కేవలం పురుషులకే కాకుండా, కూతుర్లు, కోడళ్లకు సైతం అవకాశం ఇవ్వడం ద్వారా మహిళల పట్ల కేసీఆర్‌కు ఉన్న గొప్ప మనసును తెలియజేస్తోందన్నారు ఎమ్మెల్సీ కవిత. కారుణ్య ఉద్యోగం వద్దనుకున్న వారికి గతంలో ఇస్తున్న రూ.10 లక్షలను , తెలంగాణ రాష్ట్రం వచ్చాక రూ.25 లక్షలకు పెంచామని ఎమ్మెల్సీ కవిత గుర్తుచేశారు. ఉద్యోగ విరమణ వయస్సును కూడా 61 సంవత్సరాలకు పెంచుకోవడం సంతోషకరమన్నారు. కార్మికులకు సౌకర్యవంతంగా పని చేయాలనే ఉద్దేశ్యంతో సింగరేణి క్వార్టర్స్‌కు ఉచిత విద్యుత్‌తో పాటు, ఏసీ ఏర్పాటు చేసుకునే సౌకర్యాలు కల్పించడం, ఇంటికి పది లక్షల రూపాయల వరకు వడ్డీలేని రుణాన్ని ఇవ్వడం, మహిళా కార్మికులకు రెండు సంవత్సరాల చైల్డ్ కేర్ లీవ్, దివ్యాంగులకు ఉద్యోగాలు, సింగరేణి ఏరియా ఆస్పత్రులలో తల్లిదండ్రులకు ఉచిత వైద్య సదుపాయాన్ని కల్పించడం, ఉద్యోగ విరమణ తర్వాత కూడా వైద్య సదుపాయాలు అందించడం, సింగరేణి కార్మికుల పిల్లల ఐఐటీ, ఐఐఎం లాంటి చదువులకు ఫీ రీయింబర్స్‌మెంట్ ఇవ్వడం, సింగరేణి కార్మికుల కోసం మెడికల్ కాలేజీ లాంటి అనేక గొప్ప కార్యక్రమాలు తెలంగాణ వచ్చాక సాధించుకున్నామని ఎమ్మెల్సీ కవిత తెలిపారు. బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి రోజుతో పాటు, మరో రోజున వేతనంతో కూడిన అధికారిక సెలవుగా ప్రకటించి సీఎం కేసీఆర్ అంబేద్కర్ పట్ల ఉన్న గొప్ప ప్రేమను మరోసారి చాటుకున్నారని ఎమ్మెల్సీ కవిత పేర్కొన్నారు. అమ్మ లాంటి సింగరేణి సంస్థను సీఎం కేసీఆర్ కాపాడి, విస్తరించి, ఇతర రాష్ట్రాలకు సైతం సోలార్, థర్మల్ పవర్ ఎలాంట్‌లను అదనంగా పెట్టి వేలాది మందికి ఉద్యోగాలు ఇవ్వడం, సంస్థను లాభాల బాట పట్టించడం తెలంగాణ రాష్ట్రం రావడం వల్లనే, తెలంగాణ బిడ్డ కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉండటం వల్లనే సాధ్యమయ్యాయని ఎమ్మెల్సీ కవిత స్పష్టం చేశారు.

# జోగులాంబ గద్వాల జిల్లాలో విషాదం : నలుగురిని మింగిన ఈత సరదా

**జోగులాంబ గద్వాల,జూన్5(ప్రజా మంటలు):** జోగులాంబ గద్వాల జిల్లాలో విషాదం నెలకొంది. సరదాగా ఈతకు వెళ్లిన నలుగురు చిన్నారులు మృతి చెందారు. మానవపాడు మండలం పల్లెపాడు శివారులోని కృష్ణా నదిలో ఈతకు వెళ్లిన నలుగురు చిన్నారులు చనిపోయారు. వీరిలో ఇద్దరు బాలురు, ఇద్దరు బాలికలు ఉన్నారు. చనిపోయిన వారిని అఫ్రీన్(17), సమీర్(8) నౌషిన్(7), రిహాన్(15)గా గుర్తించారు. మృతులంతా ఇటిక్యాల మండలం వల్లూరు గ్రామానికి చెందిన వారు. వీరు కొన్నాళ్ల క్రితమే కర్నూలుకు వెళ్లి.. అక్కడే స్థిరపడ్డారు.

వివాహ శుభకార్యం నిమిత్తం మానవపాడు మండలం బోరెల్లి గ్రామానికి రెండు రోజుల క్రితం వచ్చి కుటుంబ సమేతంగా బంధువులతో కలిసి మెలిసి గడిపారు. కృష్ణానదిని చూసేందుకు సమీపంలోని పల్లెపాడు శివారులో ఉన్న నది వద్దకు 11మంది ఆటోలో వెళ్లారు. అక్కడకు వెళ్లిన తర్వాత స్నానం చేయాలని భావించి.. లోపలికి వెళ్లారు. లోతట్టు ప్రాంతానికి వెళ్లడంతో అక్కడే ఉన్న బురదలో ఇరుక్కు పోయారు. దీంతో బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయారు. మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారే కావడంతో తీవ్ర విషాదం నెలకొంది. అప్పటి వరకూ ఎంతో సంతోషంగా ఉన్న పిల్లలు.. విగతజీవిగా పడి ఉండడాన్ని చూసి తల్లిదండ్రులు గుండెలు బాదుకున్నారు. పిల్లలను చూసి బోరున విలపించారు.

# బిఆర్ఎస్ నుంచి విముక్తి కోరుకుంటున్న జనం

### సిఎల్పీ నేత భట్టి పాదయాత్రలో ప్రజల మనోగతం

### టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి

**హైదరాబాద్,జూన్6(ప్రజా మంటలు):** సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఎండ, వానలు లెక్కచేయకుండా 900 కిలోమీటర్ల పైగా కొనసాడం అభినందనీయమని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లురవి అన్నారు. తెలంగాణ లక్ష్యాలు నెరవేర్చకుండా విస్మరించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పైన ప్రజలకున్న ఆగ్రహాన్ని ఈ పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ద్వారా బయటకు వెళ్లగకుతున్నారని చెప్పారు. కుల, మత ప్రాంతాలకతీతంగా బీఆర్ఎస్ ప్రభుత్వ బాధితులు ఏకమై మార్పు కావాలని కోరుకుంటున్నారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ముఖ్యమంత్రి, మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు ప్రజా సేవకులని, కానీ వీరు పెత్తందారులుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెత్తందారుల పాలనల్లో అణచివేతకు గురవుతున్న ప్రజలు తిరుగుబాటు చేసి తిరిగి ప్రజాస్వామ్యాన్ని తెచ్చుకోవడానికి వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లలో గెలిపించడానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు. తెలంగాణలో పోలీసు రాజ్యం నడుస్తున్నదని, ప్రశ్నించే అవకాశం లేకుండా స్వేచ్ఛను హరిస్తున్నారని మండిపడ్డారు. ప్రశ్నించే గొంతుకల పట్ల పోలీసు, రెవెన్యూ శాఖల వేధింపులు పెరిగిపోయాయని ఆరోపించారు. ఇటువంటి క్రమంలో విదేశాలకు వెళ్లి వచ్చిన కేటీఆర్ బీఆర్ఎస్ పార్టీకి 100 సీట్లు వస్తాయని జ్యోతిష్యం చెప్పడం హాస్యస్పదంగా ఉందన్నారు. వచ్చే



ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 100 సీట్లు వస్తాయని పీపుల్స్ మార్చ్ పాదయాత్రకు వచ్చి ప్రజలు కోరుకుంటున్న మార్పును గమనించి శాస్త్రీయంగా చెబుతున్నామన్నారు. మేధావుల్లో రాజకీయ పునరేకీకరణ మార్పు కోసం జరగాలని ఆయన సూచించారు. వెయ్యి మంది కేసీఆర్‌లు, లక్షమంది కేటీఆర్‌లు వచ్చి అడ్డుపడిన ప్రభుత్వం మార్పు అనేది అనివార్యంగా జరుగుతుందన్నారు.





# పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

## 34 ఏళ్ళ తరువాత కలుసుకున్న మిత్రులు

**భీమదేవరపల్లి జూన్ 05 (ప్రజామంటలు):** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం ములుకనూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1988-89 పదవ తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం కాశిరెడ్డి ఆదిరెడ్డి అధ్యక్షతన ఆదివారం ముల్కనూరులోని స్వాతంత్ర సమరయోధుల భవనములో ఘనంగా నిర్వహించారు.

**ప్రతి మనిషి జీవితంలో బాల్యం అనేది మరువలేనిది:**

నాటి ఉపాధ్యాయులు శంకర్ రావు మాట్లాడుతూ ప్రతి మనిషి జీవితంలో బాల్యం మరువలేనిది అన్నారు. విద్యార్థులు సామాజిక దృక్పథంతో ముందుకెళ్లాలని, నేత్రదానం, అవయవ దానం, శరీర దానం లాంటివి చేసి ఆదర్శంగా నిలవాలని అన్నారు.

**ఆత్మీయ సమ్మేళనం అపురూపం:**

అనంతరం సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, పూర్వ విద్యార్థులు పాఠశాలలో చదివి 34 ఏళ్ల అవుతున్న గత స్మృతులను గుర్తించుకొని, ఈ ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు.

**గురువులకు సన్మానం:**

తమకు విద్యాబుద్ధులు చెప్పిన నాటి గురువులను పూర్వ విద్యార్థులు శాలువాలతో ప్రత్యేకంగా ఘనంగా సన్మానించి వారి ఆశీర్వాదాన్ని తీసుకున్నారు.

**గత స్మృతుల నెమరు:**

అనంతరం పూర్వ విద్యార్థులందరూ ఒకరికి ఒకరు ఆప్యాయంగా పలకరించు కున్నారు. పూర్వ విద్యార్థులు వివిధ వృత్తులలో ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాలలో స్థిరపడిన పూర్వ విద్యార్థులు గత స్మృతులను నెమరు వేసుకుంటూ, తాము చదువుకున్న పాఠశాలలో చేసినటువంటి చిలిపి చేష్టలను, అనుబంధాలను స్మరించుకున్నారు. తమ విద్య, వైవాహిక, ఉద్యోగ జీవిత విశేషాలు, కుటుంబ నేపథ్యాల విషయాల గురించి ఒకరికొకరు చెప్పుకున్నారు.

**సెల్ఫీ ఫోటోల హంగామా:**

సెల్ఫీలు, ఫోటోలు తీసుకుంటూ ఎంతో ఆనందోత్సాహాలతో గడిపారు. ఉన్నత చదువుల అనంతరం పెళ్లిళ్లు చేసుకుని, భార్యాపిల్లలతో ఉద్యోగరీత్యా ఎక్కడెక్కడో సెటిల్ అయ్యారు.

**చిన్నారి స్నేహమా... చిగురించే కాలమా....**

చిన్ననాటి స్నేహితులను కలవాలి అని, స్నేహానికంటే మించినదేముందని దృఢ సంకల్పంతో కొంత మంది మిత్రులు కలిసి ఎలాగైనా మనం 34 సంవత్సరాల క్రితం చదువుకున్న విద్యార్థులందరూ ఎక్కడున్నారో తెలుసుకుని, ఒకసారి ఆత్మీయ సమ్మేళనం చేసుకుందామని నిర్ణయం తీసుకున్నారు. అట్టి నిర్ణయానికి అనుకూలంగా కొన్ని నెలలు కష్టపడి ఒక్కొక్కరి అడ్రస్ తెలుసుకుని ఫోన్ నెంబర్ల ద్వారా జూన్ 4 వ తేదీన ఆత్మీయ సమ్మేళనము ఏర్పాటు చేశారు. మరణించిన అధ్యాపకులకు, తోటి విద్యార్థులకు ఘనమైన అశ్రునివాళి. ఈ కార్యక్రమంలో తమతో పాటు చదువుకున్న కొంతమంది విద్యార్థులు, ఉపాధ్యాయులు మృతి చెందడంతో వారికి ఘనంగా మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఆపద, కష్ట కాలంలో ఒకరికొకరం అండగా ఉండాలని నిర్ణయించుకున్నారు. అనంతరం విద్యార్థులు స్నేహితులతో చిన్ననాటి విషయాలను గుర్తు చేసుకున్నారు. ఇట్టి ఆత్మీయ సమ్మేళనాన్ని తాము ఎప్పటికీ మర్చిపోలేము అని విద్యార్థులు ఆనందంతో తబ్బిబ్బై పోయారు. ఒకరికొకరు ఆత్మీయంగా కౌగిలించుకొని చిన్ననాడు చేసిన అల్లర్లను చిలిపి పనులను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. సంవత్సరానికి ఒక్కసారైనా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించు కోవాలని నిర్ణయించుకున్నారు.

**కార్యక్రమంలో పాల్గొన్న నాటి గురువులు:**

మన్మోహన్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, శంకర్రావు, బన్సిధర స్వామి, షేక్ మీరా, చంద్రశేఖర్, హిందీ చంద్రశేఖర్, శివప్రసాద్, మనోహర స్వామి, రాంరెడ్డి, సరోజిని, సుశీల, డార్కస్, లక్ష్మయ్య, నరేష్, రవీందర్, 80 మందికి పైగా పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.





# లిక్కర్ స్కాం నుండి బిడ్డను కాపాడుకోవడానికి బీజేపీతో కుమ్మక్కు

## కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలపాలన్న కేసీఆర్ వ్యాఖ్యలపై ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఫైర్

**జగిత్యాల జూన్ 05 (ప్రజామంటలు):** లిక్కర్ స్కాం నుంచి తన బిడ్డ ఎమ్మెల్సీ కవితను కాపాడుకునేందుకు కేసీఆర్ బీజేపీతో కుమ్మక్కు అయ్యారని, ప్రధాని మోదీ మెప్పు పొందేందుకు కాంగ్రెస్ పార్టీని బంగళాఖాతంలో కలుపుతావా అంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డి ఫైర్ అయ్యారు.

నిర్మల్ బహిరంగ సభలో సీఎం కేసీఆర్ వ్యాఖ్యలు ఆశ్చర్యం కలిగించాయని ఫైర్ అయ్యారు. జగిత్యాలలోని ఇందిరా భవన్ లో సోమవారం ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ తెలంగాణ ప్రజల దశాబ్దాల కల స్వరాష్ట్ర కాంక్షను నెరవేర్చిన పార్టీ కాంగ్రెస్ అని గుర్తు చేశారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా రైతులకు ఉచిత కరంట్ అమలు చేసి, ఏకకాలంలో రైతులకు లక్ష రూపాయల రుణ మాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదని గుర్తుచేశారు. తప్పా, తాలు లేకుండా కళ్ళం కాడ వడ్లు కొనుగోలు చేశామని, నిరుపేదలకు ఆరోగ్య శ్రీ, 104, 108 పేరుతో ఉచిత వైద్య సౌకర్యం కల్పించింది కాంగ్రెస్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో బాలికా సంరక్షణ పథకం రూపొందించామని, పంట రుణాలపై వడ్డీ రాయితీ, విత్తన రాయితీ ఇచ్చామని, నిరంతరం అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించడంతో పాటు 9 రకాల వస్తువులు అందించామని, అర్హత ప్రాతిపాదికన గృహ నిర్మాణ పథకం అమలు చేశామని జీవన్ రెడ్డి అన్నారు. అన్నీ వర్గాల ప్రజల సంక్షేమం



కోసం పాటుపడాల్సిన కేసీఆర్ కుటుంబ ప్రయోజనం కోసమే పనిచేస్తు, ప్రజా సంక్షేమం కోసం పనిచేస్తున్న కాంగ్రెస్ పార్టీని బంగాళాఖతంలో కలపాలని నిర్మల్ సభలో మాట్లాడ మోడీ మెప్పు పొందడానికేసమేనని చెప్పుకొచ్చారు. స్వార్థ ప్రయోజనాల కోసం రాష్ట్రాన్ని తాకట్టు పెట్టరాని కేసీఆర్ తీరుపట్ల మండిపడ్డారు. ఎన్టీపిసిలో విధ్యుత్ ఉత్పాదన చేయకుండా 40 వేల కోట్ల భారంతో కమిషన్ల కక్కుర్తి కోరకు యాద్ద్రాద్రి ఏర్పాటు చేశావని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో ఎవరిని ఎవరూ బంగాళాఖాతంలో కలుపుతారో నాలుగు నెలలు ఆగితే ప్రజలు నిర్ణయిస్తారని పేర్కొన్నారు. ఒక రైతుబంధు పేరు చెప్పి రైతులకు రావలసిన అన్నీ రకాల రాయితీలు రాకుండా చేస్తున్నారన్నారు. ఇకనైనా స్వార్థ ప్రయోజనాలు వీడాలని సీఎం కేసీఆర్ కు ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి హితవు పలికారు. సమావేశంలో డీసీసీ అధ్యక్షులు లక్ష్మణ్ కుమార్, మాజీ మున్సిపల్ చైర్మన్, పీసీసీ సభ్యులు గిరి నాగభూషణం, టీపీసీసీ నేత బండ శంకర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గయ్య, మండల కాంగ్రెస్ అధ్యక్షులు జున్ను రాజేందర్, జిల్లా మైనార్టీ కాంగ్రెస్ అధ్యక్షులు మన్సూర్, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుండా మధు, బొల్లి శేఖర్, నేహాల్, బీరం రాజేష్, లైశెట్టి విజయ్, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

# తల్లికి నిప్పు పెట్టాల్సిన కొడుకు

**కొడుకు మరణంతో కొడుక్కి నిప్పు పెట్టిన తల్లి**

**ఓ తల్లి అరణ్య రోధన - నరకయాతన**

**నడి రోడ్డుపై శవం - కంటతడి పెట్టించిన దృశ్యం**

**భీమదేవరపల్లి జూన్ 05 (ప్రజామంటలు):** మండలంలోని ములుకనూరు గ్రామానికి చెందిన సుంచు సాగర్ (28) అనే యువకుడు ప్రమాదవశాత్తు బావిలో పడి చనిపోయాడు. స్థానికుల కథనం మేరకు మంగళపల్లి గ్రామ శివారులోని అక్కమహంకాలి గుడి దగ్గర్లో వ్యవసాయ బావి చుట్టూ గాజు పోస్తుండగా ప్రమాదవశాత్తు బావిలోపడి చనిపోయాడు. సుంచు కుమారస్వామికి ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. 12 సవత్సరాల క్రితం అనారోగ్యంతో బాధపడుతూ కుమారస్వామి చనిపోయాడు. అతని ఆరోగ్య అవసరాల కోసం అప్పుడు ఉన్న ఒక్కగానొక్క ఇల్లును అమ్ముకుని హాస్పిటల్ ఖర్చులకు పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. ఆ కుటుంబం పెద్ద దిక్కును కోల్పోయింది. ముగ్గురు చిన్న పిల్లల్ని చేతపట్టుకుని కుటుంబ భాధ్యతల్ని భుజానవేసుకుని కైకిలి, కూలి చేసుకుంటూ ఇప్పటి



వరకూ ఇబ్బందిగానే సాగదీస్తుంది...ఆ తల్లి. పెద్దకొడుకు సాగర్ చేదోడు వాదోడుగా ఉంటూ కూలి పనులు చేసుకుంటూ తల్లికి ఆసరాగా ఉండేవాడు. కొడుకులు చేతికందే సమయంలో పెద్దకొడుకు సాగర్ హఠాన్మరణంతో ఆ ఇల్లు ఇప్పుడు వీధినపడింది. మళ్ళీ ఆ కుటుంబం ఒక పెద్ద దిక్కును కోల్పోయింది. చిన్నప్పటి నుండి కంటికి రెప్పల్లా సాదిన కొడుకు పెద్దయ్యాక నన్ను మంచిగా చూసుకుంటాడు, నన్ను కడదాకా కాపాడి నా చితికి నిప్పు పెడతాడు అని భావించిన ఆ తల్లి ....కొడుకుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నది. విధి వక్రీంచడంతో ఆమె ఆ కొడుక్కి నిప్పు పట్టడం పలువురిని కంట తడి పెట్టేలా చేసింది. ప్రస్తుతం ఆ తల్లి బిడ్డలకు ఉండబోదామంటే ఇల్లు లేదు, తిందామంటే తిండిలేదు అన్న చందంగా మారిపోయింది. ఇల్లులేని ఆ కుటుంబం అద్దె ఇంట్లో కిరాయి ఉండగా, ఇప్పుడు సాగర్ చనిపోతే స్వంత ఇల్లులేక నడిరోడ్డుపై శవాన్ని వేసుకుని ఆరుబయట ఓ ఖాళీస్థలంలో అద్దె టెంటు వేసుకుని చుట్టూ పరదాలు కట్టుకుని అందులో ఉంటోంది. రెక్కాడితే గానీ డొక్కాడని ఆ కుటుంబం, చిన్నప్పటి నుండి కంటికి రెప్పలా సాదుకున్న కొడుకు మరణంతో ఆ తల్లి గుండెలవిసి పోతున్నాయి. పిల్లల పసి ప్రాయంలోనే తండ్రి దూరమై, అప్పటి నుండి ఇప్పటివరకు తల్లి బాధ్యతల్ని భుజాన వేసుకుని పెద్ద దిక్కుగా ఉన్న పెద్దకొడుకు సాగర్ బావిలో పడి మరనించడంతో ఆ కుటుంబం ఒక్కసారిగా రోడ్డున పడింది. ఆ తల్లి ఆపన్న హస్తం కోసం, ఆదుకునే దేవుని కోసం ఎదురు చూడడం తప్ప చేసేది ఏమీ లేక కూమిలిపోతుంది.

## టియుడబ్ల్యూజే (ఐజేయు)
# జనగామ కార్యవర్గ ఏకగ్రీవ ఎన్నిక

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (ఐజేయు) జనగామ జిల్లా ద్వితీయ మహాసభ నిర్వహించి నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఇర్రి మల్లారెడ్డి (ప్రజాతంత్ర),ప్రధాన కార్యదర్శి సురిగెల బిక్షపతి (సాక్షి టీవి), కోశాధికారిగా ఓరుగంటి సంతోష్ కుమార్ (10 టీవి) ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ద్వితీయ మహాసభలకు ముఖ్య అతిధిగా జనగామ ఎంఎల్ఏ ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, గౌరవ



అతిధులుగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారులు దేవులపల్లి అమర్, టియుడ బ్ల్యూజె రాష్ట్ర అధ్యక్షులు నంగునూరి శేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరహత్ అలీ, రాష్ట్ర కార్యదర్శి గాడిపెల్లి మధు, జాతీయ కౌన్సిల్ సభ్యులు దాసరి కృష్ణారెడ్డి, అడ్డగొడ రాజేష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ హింగె మాధవరావు, కెమిడి ఉపేందర్, జంపాల శ్రీనివాస్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## అనగోని వెంకటరాజ్యం ట్రస్టు ఆధ్వర్యంలో
# బస్సు పాసుల పంపిణీ

**సైదాపూర్ జూన్ 05 (ప్రజామంటలు):** వికలాంగులకు వృద్ధులకు కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ లో



ఆవరణంలో స్వర్గీయ అలగోని వెంకట్ రాజ్యం మాజీ ఎంపిటిసి జ్ఞాపకార్థం వారి కుమారుడు వీరన్న గౌడ్ సుమారు వందమంది వికలాంగులకు ఉచిత బస్సు పాసులు ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో హుజురాబాద్ బస్ డిపో మేనేజర్ కూతురి విద్యాన్ రెడ్డి, పైడిపల్లి రవీందర్ గౌడ్, ఆర్టీసీ డ్రైవర్ మాడెపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## సూరారం పెట్రోల్ బంక్ వద్ద
# ఘోర రోడ్డు ప్రమాదం, ఒకరు మృతి

**ఎల్కతుర్తి జూన్ 05 (ప్రజామంటలు):** ఎల్కతుర్తి మండలం సూరారం పెట్రోల్ బంక్ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగినది వివరాల్లోకి వెళితే పెంచికలపేట గ్రామానికి చెందిన పెరుమాండ్ల పెద్ద రాజయ్య వెహికల్ నెంబర్ ఏపీ 37 ఈ హెచ్ 1056 ఫ్యాషన్ ప్రో బండి పైన ఎల్కతుర్తి బ్యాంకు పని నిమిత్తము వచ్చి పని ముగించుకొని తిరిగి మళ్ళీ పెంచికలపేటకు వెళుతుండగా సూరారం పెట్రోల్ బంక్ వద్ద లారీ నంబర్ ఎన్ ఎల్ జీరో వన్ ఎ ఎస్ 3167 గల లారీని కుడి పక్క నుండి



దాటుతుండగా లారీ డ్రైవర్ అజాగ్రత్త వల్ల ప్రమాదం జరిగినది. ఈ ప్రమాదంలో పెరుమాండ్ల పెద్ద రాజయ్యను వారి వెంట ఉన్న అబ్బాయి లక్ష్మణుకు కుడి కాలుకు దెబ్బ తగలడం వలన ఇద్దరినీ 108 వెహికల్ లో చికిత్స నిమిత్తము ఎంజీఎం ఆసుపత్రికి తరలించగా రాజయ్య మార్గమధ్యలోనే చనిపోయాడని డాక్టర్లు తెలిపారు. లక్ష్మణు కు ప్రధమ చికిత్స చేసి ఆస్పత్రిలో అడ్మిట్ చేశారు ఈ లారీ డ్రైవర్ శ్రీనివాస్ యాదవ్ సన్నాఫ్ శ్రీ పాల్ యాదవ్ వీరు ఉత్తర ప్రదేశ్ రాష్ట్రానికి చెందినవారుగా పోలీసులు గుర్తించారు.

## ఓపెన్ టు ఆల్ కరాటే ఛాంపియన్ షిప్ పోటీలు

**సత్తా చాటిన జగిత్యాల విద్యార్థులు**

**జగిత్యాల, జూన్ 05 (ప్రజామంటలు):** ఈ నెల 4 తేదీ కరీంనగర్‌లో తెలంగాణ ఓపెన్ టు కరాటే ఛాంపియన్ షిప్-2023 పోటీల్లో జగిత్యాల



ఒకినావా స్కూల్ ఆఫ్ కరాటేకు చెందిన విద్యార్థులు సత్తా చాటి 48 గోల్డ్ సిల్వర్ బ్రొంజ్ పతకాలు సాధించినట్లు జగిత్యాల ఓకినవ స్కూల్ ఆఫ్ కరాటే సీనియర్ మాస్టర్ చీఫ్ ఎగ్జామినర్ ఎం. లింగయ్య తెలిపారు. కరాటే ఇన్స్ట్రక్టర్ తిరుమల నరేష్ తదితరులు అభినందించారు.

## అంగన్‌వాడీలో సామూహిక శ్రీమంతాలు

**కోరుట్ల జూన్ 05 (ప్రజామంటలు):** కోరుట్ల పట్టణంలోని రహమత్ పుర -2 అంగన్ వాడి కేంద్రంలో సామూహిక శ్రీమంతాలు చేశారు. అంగన్ వాడి టీచర్లు పోషక అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం వేడుకలు నిర్వహించారు. గర్భిణీలకు పండ్లు పూలు అందజేసి ఆశీర్వదించారు. ఈ సందర్భంగా అంగన్ వాడి టీచర్లు చింత



అరుణ, చోడ పుష్పలత మాట్లాడుతూ.... మహిళలు, శిశువుల సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణ కోసం తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్య లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని తెలిపారు.

గర్భిణీలు మంచి పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గర్భిణీలు, పిల్లలు, మహిళలు పాల్గొన్నారు.



05
ఘనంగా ఏరువాక పౌర్ణమి వేడుకలు

కొడిమ్యాల: జూన్ 05 (ప్రజామంటలు): జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండల కేంద్రము లోనీ సాయిబాబా ఆలయంలో ఏరువాక పౌర్ణమిని పురస్కరించు కొని ప్రత్యేక పూజలు, హారతి, పల్లకి సేవ నిర్వహించారు. అనంతరం 500 మందికి కోసున నరేందర్ రెడ్డి, గౌతమి దంపతులు అన్న దానం చేశారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ నిర్వాహక కమిటీ బాద్యులు గుండేటి రమేష్, ఏనుగు ఆదిరెడ్డి, ఎల్లం శ్రీనివాస, నారకట్ల మహిపాల్ , కొత్తూరి స్వామి, పూజారి నాగరాజు శ్రీనివాస్, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మొగిలిపేట మీదుగా గోదావరి హారతి యాత్ర

### స్వాగతం పలికిన మహిళలు, గ్రామస్తులు, నాయకులు

**మల్లాపూర్ జూన్ 05 (ప్రజామంటలు):** గోదావరి హారతి యాత్రలో భాగంగా మొగిలిపేట మీదుగా వెళ్తున్న బిజెపి జాతీయ నాయకులు మురళీధర్ రావు కు శాలువా కప్పి స్వాగతం పలికిన గ్రామ నాయకులు , అనంతరం బంజారా మహిళల సమస్యలు అడిగి తెలుసుకున్న



మురళీధర్ రావు. వారి ఆట పాటలతో స్వాగతం పలికిన మహిళలు ఇట్టి కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ నాయకులు పుదారి నిశాంత్ కార్తికేయ, జిల్లా సోషల్ మీడియా కోర్ కమిటీ మెంబర్ గోల్కొండ ప్రవీణ్ కుమార్, మండల ఉపాధ్యక్షుడు మోకు రాజేందర్, జిల్లా వార్డు మెంబర్ ఫోరం అధికార ప్రతినిధి బంటు మారుతి, బుర్రి భీమన్న, గోనె లక్ష్మీనారాయణ, రెబ్బస్ సంజీవ్, అజ్మీరా శ్రీనివాస్ నాయక్, కడకుంట్ల నరేందర్, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ జ్ఞాన ధ్యాన విజ్ఞాన సరస్వతీ దేవాలయం

### తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు

**మల్యాల జూన్ 05 (ప్రజామంటలు):** మల్యాల మండలం నూకపల్లి సరస్వతీ నగర్ బీసీ కాలనీలో కొండపై వేంచేసి ఉన్న శ్రీ జ్ఞాన ధ్యాన విజ్ఞాన సరస్వతీ దేవాలయం తొమ్మిదవ వార్షికోత్సవ వేడుకలు సోమవారం



ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాన్ని సర్వాంగ సుంద రంగా అలంకరించారు. భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. విచ్చేసిన భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాద వితరణ గావించారు. అమ్మవారి నామస్మరణతో ఆలయమంతా మారు మోగింది.

## సరస్వతి భాయ్ ఫాల్కే అవార్డు అందుకున్న డా. షేక్ చాంద్ పాషా, డా. సయ్యద్ సమీనా పర్వీన్

**ముంబై బ్యూరో జూన్ 05 (ప్రజామంటలు):** ముంబై వెంజన్ వెంకట్ హాలులో జూన్ 3న, ఎందరో అతిరథుల చేతుల మీదుగా రవీందర్ ఆరో







రాజి రజియా మురద్, నేహాజీ సుందరి జి. సామాజిక సేవకురాలు, చీఫ్ గెస్ట్ త్రిపాఠీ జీ అనేక మంది సినీ తరాల, నిర్మాతలు, డైరెక్టర్లు, సినీ కళాకారుల చేతుల మీదుగా మొదటిసారి సరస్వతి భాయ్ ఫాల్కే, మొదటి అవార్డ్, డాక్టర్ షేక్ చాంద్ పాషా ఇంటర్నేషనల్ సోషల్ వర్కర్ %ల% ఎన్ఆర్ఐ టిపిసిసి కన్వీనర్, (తెలంగాణ రాష్ట్రం) కు మరియు సరస్వతీ భాయి ఫాల్కే 2వ అవార్డు కవయిత్రి, రచయిత్రి, ప్రభుత్వ ఉపాధ్యాయురాలు డా. సయ్యద్ సమీనా పర్వీన్, కరీంనగర్ జిల్లా (తెలంగాణ) అందుకున్నారు.

# వెలుగు జిలుగుల రాష్ట్రంగా తెలంగాణ

- రాష్ట్రం ఏర్పడే నాటికి 2700 మెగావాట్ల విద్యుత్ లోటు
- రాష్ట్రం ఏర్పాటైన 9 ఏండ్లల్లో మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ
- దేశంలో విద్యుత్ వినియోగంలో మనమే నెంబర్ వన్
- విద్యుత్ రంగంలో అగ్రగామిగా పాలకుర్తి నియోజకవర్గం
- పాలకుర్తి 132/33 కేవీ సబ్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి

**పాలకుర్తి జూన్ 05 (ప్రజామంటలు):** చీకట్లో మగ్గిపోతున్న రాష్ట్రాన్ని వెలుగు జిలుగుల తెలంగాణగా మార్చిన ఘతన మన సీఎం కెసిఆర్ కే చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ మంచినీటి సరఫరాశాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారు. రాష్ట్రం ఏర్పడేనాటికి 2700 మెగావాట్ల విద్యుత్ లోటు నుంచి రాష్ట్రం ఏర్పాటైన 9 ఏండ్లల్లో మిగులు విద్యుత్ రాష్ట్రంగా తెలంగాణ ఆవిర్భవించిందని మంత్రి అన్నారు. ఇంత తక్కువ కాలంలో ఇంత ఎక్కువగా పని చేసి, దేశంలోనే విద్యుత్ వినియోగంలో నెంబర్ వన్ రాష్ట్రంగా నిలిచిందని, రాష్ట్రం వస్తే చీకట్లో మగ్గుతారని అన్న అప్పటి సీఎం ఇప్పటి వరకు కనిపించడం లేదని ఎద్దేవా చేశారు. విద్యుత్ విజయం ప్రతిభ అంతా సీఎం కెసిఆర్ కే చెందుతుందని, అకుంఠిత దీక్ష, దక్షతలతో నిరంతరం శ్రమించి, తెలంగాణలో కోతలు లేని, హాలీడేలు లేని, నాణ్యమైన 24 గంటల విద్యుత్ ని నిరంతరాయంగా అందిస్తున్న ఏకైక రాష్ట్రంగా తెలంగాణ అవతరించిందని మంత్రి తెలిపారు. రాష్ట్రావతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా పాలకుర్తిలో 132/33 కేవీ సబ్ స్టేషన్ ను ప్రారంభించిన మంత్రి, అనంతరం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో జరిగిన విద్యుత్ విజయోత్సవ సభలో మంత్రి మాట్లాడారు. విద్యుత్ లోటు, నిరంతర కోతలు, పవర్ హాలీడేలు, కరెంటు లేక పంటలు ఎండిపోయే దుస్థితి నుండి ఇవ్వాళ రాష్ట్రం ఏర్పాటు తర్వాత విద్యుత్ మిగులు రాష్ట్రంగా అభివృద్ధి చెందిందని మంత్రి ఎర్రబెల్లి తెలిపారు. అభివృద్ధికి సూచికగా, ఇవ్వాళ తలసరి విద్యుత్ వినియోగంలో 1196 యూనిట్లతో దేశంలోనే నెంబర్ వన్ గా నిలిచిందని తెలిపారు. రాష్ట్రం ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రభుత్వం అందించిన సబ్సిడీల సహకారం రూ.50వేల కోట్లకు పైగా ఉందని అన్నారు. రాష్ట్రంలో 27 లక్షల 10 వేల విద్యుత్ కనెక్షన్లు ఉండగా, రైతుల తరపున ఇతర అన్ని రకాల సబ్సిడీగా 50 వేల కోట్లు ప్రభుత్వం విద్యుత్ సహకారం అందించిందని మంత్రి వెల్లడించారు. ఒక్కో మోటారుకు లక్షా 20వేల సబ్సిడీ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో



కేవలం 49వేల కోట్లు మాత్రమే చెల్లిస్తే, ఇప్పుడు 883 కోట్లు సబ్సిడీగా ప్రభుత్వం చెల్లించందన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో 87వేల 980 మంది రైతులకు 880 కోట్ల 4 లక్షలు సబ్సిడీగా చెల్లించినట్లు వివరించారు.

విద్యుత్ రంగంలో అగ్రగామిగా పాలకుర్తి నియోజకవర్గం:
అలాగే రజకులకు ఆర్థికంగా తోడ్పాటుకు పాలకుర్తి నియోజకవర్గానికి 501 రజక సర్వీసులకు 250 యూనిట్లు ఉచితంగా ఇస్తూ, ఇప్పటి వరకు 16 లక్షల 66 వేల రూపాయలు అందించడం జరిగింది. 246 నాయీబ్రాహ్మణ సర్వీసులకు గాను 250 యూనిట్లు ఉచితంగా ఇస్తూ, ఇప్పటివరకు 36 లక్షల 62 వేల రూపాయల సబ్సిడీ అందించాము. ఎస్‌సి/ఎస్‌టి విద్యుత్ వినియోగదారులకు 101 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం కింద 887 సర్వీసులకు ఇప్పటి వరకు 3 కోట్ల 73 లక్షల రూపాయలు అందించడం జరిగింది. నాడు పాలకుర్తి నియోజకవర్గంలో 27 సబ్ స్టేషన్లు మాత్రమే ఉండగా తెలంగాణ ఏర్పడిన తరువాత అదనంగా 14 సబ్ స్టేషన్లు 25 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నాము. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 32 వేల 624 కనెక్షన్లకు 149 కోట్ల రూపాయలు మాత్రమే చెల్లించడం జరిగింది, కాని తెలంగాణ ఏర్పడిన తరువాత అదనముగా 8 వేల 275 సర్వీసులు మంజూరు చేసి మొత్తం ఈ 10 ఏళ్లలో 883 కోట్ల 73 లక్షల రూపాయలు సబ్సిడీ రూపంలో ప్రభుత్వం చెల్లించడం జరిగింది. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 5 వేల 830 ట్రాన్స్ ఫార్మర్లు ఉండగా 99 కోట్ల 93 లక్షల రూపాయల తో ఏర్పాటు చేశారు, కాని తెలంగాణ ఏర్పడిన తరువాత అదనంగా 2 వేల 500 కొత్త ట్రాన్స్ ఫార్మర్లు 37 కోట్ల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నాము. పాలకుర్తి నియోజకవర్గంలో తెలంగాణ ఏర్పడక ముందు 71 వేల 712 కరెంటు పోల్స్ 29 కోట్ల 56 లక్షల రూపాయలతో ఏర్పాటు చేయగా, తెలంగాణ ఏర్పడిన 9 సంవత్సరాల కాలంలో అదనంగా 61 వేల 412 కరెంటు పోల్స్ ను 25 కోట్ల 30 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసుకోన్నామని మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వివరించారు. వాస్తవాలు ఇలా వుండగా, కొందరు అర్థంలేని ఆరోపణలు చేస్తూ, ప్రజల్ని తప్పుదోవ పట్టిస్తున్నారని, అలాంటివాళ్ళు ఊళ్ళకు వస్తే, వారిని నిలదీయాలని ప్రజలకు, పార్టీ కార్యకర్తలకు మంత్రి పిలుపునిచ్చారు.

### విద్యుత్ ఉత్పత్తి, వినియోగంలో మనమే నెంబర్ వన్:

జిల్లా కలెక్టర్ శివలింగయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉత్పత్తితోపాటు,వినియోగంలోనూ మన రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ గా ఉందన్నారు. సీఎం కెసిఆర్, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావులు కలిసి అటు రాష్ట్రాన్ని, ఇటు పాలకుర్తి నియోజకవర్గాన్ని అద్భుతంగా విద్యుత్ రంగంలో తీర్చిదిద్దారన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ప్రతి పనికి విద్యుత్ వినియోగం అధికమవుతుందని అయినా కూడా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందిస్తుందని అన్నారు గతంలో పోల్చుకుంటే ఇప్పుడు మన రాష్ట్రం విద్యుత్ కోతలు లేకుండా చర్యలు తీసుకుంటుందని అందుకు విద్యుత్ ఉద్యోగులకు ముఖ్యమంత్రి గారికి అభినందనలు తెలిపారు. అంతకుముందు మంత్రికి విద్యుత్ ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. విద్యుత్ మహిళ ఉద్యోగులు బతుకమ్మలు ఆడారు. సభలో వివిధ సాంస్కృతిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమాల్లో డిఆర్ డిఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ రామిరెడ్డి, డీఈఓ రాము, విద్యుత్ శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ వ్యాప్తంగా తరలి వచ్చిన ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సుగుణాకర్ రాజుపై తప్పుడు ప్రచారం మానుకోవాలి

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి సుగుణా రాజు పై తప్పుడు ప్రచారాలు మానుకోవాలని, పడుగుల దామోదర్ పై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కరెన్సీ పై అంబేద్కర్ ఫోటో సాధన సమితి జాతీయ అధ్యక్షులు డాక్టర్ పరశురామ్ అన్నారు. సోమవారం జనగామ ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో విలేకరుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడుతూ.... పడుగుల దామోదర్, మొదటి భార్యతో 2010 లో వివాహం జరిగిందని, 2011 జూన్ 13న కడుపు నొప్పితో ఏరియా ఆసుపత్రికి రాగా ఆర్ ఎం ఓ గా ఉన్న డాక్టర్ పి సగుణాకర్ రాజు వైద్యం చేశారని, అతనిపై తన భార్య కేసు పెట్టడం వల్ల జైలుకు వెళ్ళాడని, వారి మధ్య గొడవలు ఎక్కువ కావడం వల్ల 2013లో కోర్టు కు వెళ్లారు 2014 ఆగస్టు 21న కోర్టు విడాకులు మంజూరు చేసింది మా ఇద్దరి మధ్య ఇలాంటి బేధాభిప్రాయాలు లేవు అని ఒకరిపై ఒకరు పెట్టుకున్న కేసులు తీసేసుకున్నారు. 2017 ఫిబ్రవరి 16న తన



నుండి విడిపోయి మళ్ళీ రెండవ పెండ్లి చేసుకో బోతుందని అక్కసుతో తెలంగాణ మెడికల్ కౌన్సిల్ వెళ్లగా కొట్టేసింది. 2011 ఫిబ్రవరి 28న ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ కు వెళ్లగా అప్పుడు కూడా కొట్టేశారు. ఇప్పుడు నేషనల్ మెడికల్ కమిషన్ కు అప్పీల్ కు వెళ్ళాడు. 60 రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరింది. దీనికి కొంతమంది కావాలని సూపరింటెండెంట్ పదివి పోయిందని తన యొక్క మనోభావాలను దెబ్బతీయాలని చూస్తున్నారని, న్యాయ వ్యవస్థ పై నమ్మకం ఉంది అణగారిన వర్గాల పేదల డాక్టర్ డాక్టర్ పి సుగుణాకర్ రాజు అని అన్నారు. తప్పుడు ప్రచారం చేస్తున్న పడుగుల దామోదర్ పై ఎస్సీ ఎస్టీ అట్రాక్స్ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యాసరపు కర్ణాకర్, పిడుగు ఆశీర్వాదం, కచ్చిగల్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూములు ఆక్రమణ

### భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

### కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం మహాధర్నా

**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఎం ఆధ్వర్యంలో ఇళ్ల పట్టాలు ఇవ్వాలని ప్రభుత్వ భూములు ఆక్రమించిన భూకబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ మహాధర్న కార్యక్రమం నిర్వహించారు. ఈ మహాధర్నా కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ.... జనగామ జిల్లాలో వేలాది మంది పేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు నేటికి లేవు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్న ఇండ్లు లేని పేదలందరికి డబుల్ బెడ్రూం ఇండ్లను నిర్మించి ఇస్తామన్న ప్రభుత్వ వాగ్దానం నేటికి అమలుకు నోచుకోలేదు. డబల్ బెడ్రూం ఇండ్ల స్కీమ్ నే ప్రభుత్వం ఎత్తివేసింది. ఎంతో ఆశతో ఎదురుచూసిన పేదలకు సొంతింటి కల కలగానే మిగిలింది. సొంత ఇండ్లు లేక వేలాది మంది అద్దె ఇంటిలో నివాసం ఉంటున్నారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరల ప్రభావం మరోవైపు ఉపాధి దొరకక ఆర్థికంగా చితికిపోయిన ప్రజలకు ఇంటి సమస్య భారంగా మారింది. జిల్లాలో అనేక చోట్ల అధికార పార్టీ అండదండలతో అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, రియలెస్టేట్ భూకబ్జాదారులు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుంటున్నారని అన్నారు. ఈ ధర్నా కార్య క్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఇ. అహల్య,



సాంబరాజు యాదగిరి, రాపర్తి సోమయ్య, సింగారపు రమేష్, జిల్లా కమిటీ సభ్యులు బూడిది గోపి, భూక్య చందు నాయక్, జోగు ప్రకాష్, బోడ నరేందర్, కోడెపాక యాకయ్య, చిట్యాల సోమన్న, నాగరాజు, ఎండి అజారుద్దీన్ నాయకులు గంగాపురం మహేందర్ కళ్యాణం లింగం ఎండి దస్తగిరి మిట్యా నాయక్ ఆ లలిత కళ్యాణి రజిత, శంకరయ్య, బి. గణేష్, పాము కుంట్ల చందు, దడిగే సందీప్, పల్లెర్ల శంకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

# పర్యావరణ రక్షణ అందరి బాధ్యత

### సిటీ కాలేజీ ప్రొఫెసర్ జే. నీరజ

### చారిత్రక మెట్ల బావి వద్ద ఎన్విరాన్మెంట్ డే

**సికింద్రాబాద్ జూన్ 05 (ప్రజామంటలు):** పర్యావరణాన్ని కాపాడుకోవడం అందరి అవసరం, అందరి బాధ్యత అని సిటీ కాలేజీ ప్రొఫెసర్ జే.నీరజ అన్నారు. సోమవారం ప్రపంచ ఎన్విరాన్మెంట్ డే సందర్భంగా బన్సీలాల్ పేట లోని చారిత్రక మెట్ల బావి వద్ద ఫోరమ్ ఫర్ బెట్టర్ హైదరాబాద్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల కార్య క్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడుతూ..పూర్వీకులు మనకు ఇచ్చిన వారసత్వ సంపదను ద్వంసం చేయకుండా, మనం దానిని మన భవిష్యత్ తరాలవారికి భద్రంగా అందించాలని కోరారు. సిటీలోని పురాతన బావులను పునరుద్ధరించి, చక్కగా కాపాడుతున్న ఎన్జీవోలు, ప్రభుత్వ తోడ్పాటు అభినందనీయమన్నారు. ఈసందర్భంగా పర్యావరణ అంశంపై విద్యార్తులు రాసిన కథల సంపుటి బాల చెలిమి అనే పుస్తకాన్ని ఆమె ఆవిష్కరించారు. సిటీలోని పలు స్కూల్



విద్యార్థులు ఈసందర్భంగా మెట్లబావిని సందర్శించి, విశేషాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఫోరమ్ ఫర్ బెట్టర్ హైదరాబాద్ ఛైర్మన్ వేదకుమార్, ఎంఎస్ఐ డైరెక్టర్ వర్గీస్, ఎస్ఆర్డీ సంస్థ ఛైర్మన్ శ్రీనివాసరెడ్డి, గండిపేట వెల్ఫేర్ సొసైటీ వైస్ ఛైర్మన్ రాజేశ్వరీ, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, స్కూల్ , కాలేజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

## రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ దినోత్సవం



**జనగామ జూన్ 05 (ప్రజామంటలు):** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా విద్యుత్ దినోత్సవం ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అధ్యక్షతన అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఉషోదయ గార్డెన్‌లో నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా విద్యుత్ వినియోగంపై సంస్కరణలు చేసి పౌరులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నాణ్యమైన విద్యుత్తును అందించడం కేవలం ముఖ్యమంత్రి చంద్రశేఖర రావు కి సాధ్యమైందని అన్నారు. అంతకుముందు జాతీయ జెండాను ఎగరవేసి విద్యుత్ వారోత్సవాలను ఘనంగా జరుపు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవ సాయ శాఖ అధికారి వినోద్ కుమార్, రైతుబంధు అధ్యక్షుడు రమణారెడ్డి, ఎంపీపీ జడ్పిటిసి ఎంపిటీసీ సంబంధిత శాఖల సిబ్బంది విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు సాయిబాబాను సన్మానించిన ఎమ్మెల్యే ముత్తిరెడ్డి

### ప్రజాక్షేత్రంలో జర్నలిస్టుల పాత్ర గొప్పది

**బచ్చన్నపేట జూన్ 05 (ప్రజామంటలు):** జనగామ జిల్లా బచ్చన్నపేట ప్రెస్ క్లబ్ (రి.నెంబర్ 272/ 2023) అధ్యక్షుడు జంగిలి సాయిబాబా ను జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి శాలువతో సన్మానించి శు



భాకాంక్షలు తెలిపారు.
అనంతరం ప్రెస్ క్లబ్ సభ్యులను రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు ఇర్రి రమణారెడ్డి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... ప్రజాక్షేత్రంలో జర్నలిస్టుల పాత్ర గొప్పదని, తెలంగాణ సాధించడానికి జర్నలిస్టులు ఎంతో కృషి చేశారని అన్నారు. జనగామ గడ్డపై బిఆర్ఎస్ హ్యాట్రిక్ సాధించడానికి ప్రతి జర్నలిస్ట్ తెలంగాణ పథకాలను ప్రజలకు తెలియజేసే విధంగా వార్తలను ప్రజలకు సమాచారం తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎలక్ట్రిక్ మీడియా అసోసియేషన్ ఉపాధ్యక్షులు చింతల మధు కృష్ణ, మండల ఉపాధ్యక్షులు చింతల రాజిరెడ్డి, గౌరవ అధ్యక్షులు వెంకటేష్ గౌడ్, ప్రధాన కార్యదర్శి రమేష్, సహాయ కార్యదర్శి ఇజ్జగిరి కరుణాకర్, కోశాధికారి ఆల్వాల రాజు, సలహాదారులు గొర్రె దేవదాసు, కార్యవర్గ సభ్యులు కర్రే సంపత్ లు పాల్గొన్నారు.

# శర్వానంద్ కి ఇక నుండైనా కలిసి వచ్చేనా..?



యువ హీరోల్లో విలక్షణ నటుడిగా తనను తాను మౌల్డ్ చేసుకుంటూ వస్తున్నాడు శర్వానంద్. ఎలాంటి సినీ నేపథ్యం లేకపోయినా ముందు సైడ్ రోల్స్ చేసి వెన్నెల సినిమాతో లైమ్ లైట్ లోకి వచ్చాడు శర్వానంద్. తన మార్క్ సినిమాలు చేస్తూ వస్తున్న ఈ యువ హీరోకి ఈమధ్య అదృష్టం కలిసి రావట్లేదు. కెరీర్ లో గమ్యం ప్రస్థానం రన్ రాజా రన్ ఎక్స్ ప్రెస్ రాజా మహానుభావుడు లాంటి సినిమాలు తీసిన శర్వానంద్ ఈమధ్య వరుస ఫ్లాపులతో సతమతమవుతున్నాడు. 2017లో వచ్చిన మహానుభావుడు సినిమా తర్వాత దాదాపు ఆరేళ్లుగా శర్వానంద్ ఖాతాలో ఒక్క హిట్ పడలేదని చెప్పొచ్చు. ప్రస్తుతం శర్వానంద్ తన 35వ సినిమా శ్రీరామ్ ఆదిత్య డైరెక్షన్ లో చేస్తున్నాడు. ఈ సినిమాలో కృతి శెట్టి హీరోయిన్ గా నటిస్తుంది. రీసెంట్ గా బ్యాచిలర్ లైఫ్ కి ముగించి పెళ్లి చేసుకున్నాడు శర్వానంద్. శర్వానంద్ రక్షిత శెట్టిని పెళ్లాడారు. రీసెంట్ గా వీరి మ్యారేజ్ కేవలం కొద్దిమంది కుటుంబ సభ్యులు సినీ ప్రముఖుల సమక్షంలో జరిగింది. పెళ్లి హడావిడి లో ఉన్న శర్వానంద్ దాదాపు 3 నెలల నుంచి సినిమా విషయాలన్నీ పక్కన పెట్టేశాడు.

తను చేస్తున్న సినిమా షూటింగ్ కి కూడా మరో రెండు నెలల దాకా బ్రేక్ ఇచ్చినట్టు తెలుస్తుంది. శర్వానంద్ కెరీర్ ప్రస్తుతం అటు ఇటుగానే ఉంది. అయితే హీరోల కెరీర్ అనూహ్యంగా పెళ్లి తర్వాత మారిపోతుంది. కొందరు స్టార్స్ కి ఆఫ్టర్ మ్యారేజ్ లక్ కలిసి వచ్చి బ్లాక్ బస్టర్ హిట్లు పడతాయి. శర్వానంద్ క్ కూడా ఇక నుండైనా కలిసి వస్తుందా లేదా అన్నది చూడాలి. శర్వానంద్ ఎంచుకునే కథలు బాగున్నా ఎగ్జిక్యూషన్ విషయంలో పొరపాట్ల వల్ల ఫలితాలు తేడా కొట్టేస్తున్నాయి.

పెళ్లి తర్వాత స్టార్స్ గా మారిన ఎంతోమంది హీరోలు ఉన్నారు. వారి దారిలోనే మ్యారేజ్ తర్వాత శర్వానంద్ కెరీర్ ఊపందుకుంటుందా.. వరుస సక్సెస్ లు అందుకుంటాడా లేదా అన్నది చూడాలి. శర్వా 35వ సినిమా చివరి దశకు చేరుకున్నాక తన నెక్స్ట్ సినిమా అనౌన్స్ మెంట్ చేయాలని చూస్తున్నాడు శర్వానంద్. ఇప్పటికే ఒకరిద్దరు దర్శకులు తమ దగ్గర ఉన్న కథలతో శర్వానంద్ ను కలిశారట. శర్వానంద్ కూడా ఫెయిల్యూర్స్ ని పట్టించుకోకుండా తన పంథాలో తాను సినిమాలు చేసుకుంటూ వెళ్తున్నాడు. శ్రీరామ్ ఆదిత్య టాలెంటెడ్ డైరెక్టర్ కాబట్టి శర్వానంద్ కి ఒక సూపర్ హిట్ ఇస్తాడని ప్రేక్షకులు ఆశిస్తున్నారు. ఆఫ్టర్ మ్యారేజ్ శర్వా సినిమా కెరీర్ ఎలా ఉండబోతుంది అన్నది తన నెక్స్ట్ సినిమా రిజల్ట్ ని బట్టి చెప్పొచ్చు.

# బ్రో..మూవీలో... ప్రత్యేక పబ్ సాంగ్

## రకుల్ ప్లేస్‌లో ఊర్వశి రౌతేలా ఖాయం

పవన్ కల్యాణ్, ఆయన మేనల్లుడు సాయిధరమ్ తేజ్ కలిసి నటిస్తున్న చిత్రం 'బ్రో'సముద్రఖని దర్శకత్వంలో జీ స్టూడియోస్‌తో కలిసి టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం చిత్రీకరణ తుదిదశలో ఉంది. ఈ వారంలో పవన్, తేజ్‌లపై ఓ పబ్ సాంగ్‌ను చిత్రీకరించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ ప్రత్యేక గీతం కోసం తొలుత రకుల్‌ను సంప్రదించారని, ఆమె బాలీవుడ్ చిత్రాలతో బిజీగా ఉండడం, ప్రత్యేక గీతంలో నటించడం ఇష్టం లేకపోవడంతో సున్నితంగా తిరస్కరించిందని తెలుస్తోంది. ఇప్పుడీ పాట కోసం బాలీవుడ్ బ్యూటీ ఊర్వశి రౌతేలను ఎంపిక చేశారని సమాచారం. అయితే ఆదివారం ఊర్వశి పవన్‌కల్యాణ్ నటించిన 'ఖుషి' సినిమా చూసింది. ఈ విషయాన్ని స్వయంగా ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. దీన్ని బట్టి 'బ్రో' ప్రత్యేక గీతానికి ఊర్వశి రౌతెల సై అన్నట్లే అనిపిస్తోంది. ఇప్పటికే ఆ పాటకు సంబంధించి పబ్ సెట్‌ను సిద్ధం చేశారని తెలుస్తోంది. ఈ పాటకు గణెళిశ్, భాను మాస్టర్ నృత్యరీతుల్ని సమకూర్చు తున్నారట. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకుని ఈ చిత్రం జులై 28న ప్రేక్షకుల ముందుకు రానుంది.



### నేడు ఆదిపురుష్

# ప్రీ రిలీజ్ ఈవెంట్

## భారీగా ఏర్పాట్లు చేసిన నిర్మాణసంస్థ

## ముఖ్య అతిథిగా చిన్నజీయర్ స్వామి రాక

'ఆదిపురుష్' విడుదల కోసం భారీతీయులే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా ఇప్పుడు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. 16నయ చిత్రం విడుదల కాబోతోంది. ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్ అయినప్పటి నుంచీ సోషల్ మీడియాలో ఈ చిత్రం గురించే చర్చ జరుగుతోంది. తొలుత విడుదలైన టీజర్‌తో పూర్తి నెగటివ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం ట్రైలర్, శ్రీరామ్ పాట విడుదల కాగానే సినిమాపై బజ్ పెరిగింది. ఇప్పుడు సోషల్ మీడియా మొత్తం ఈ సినిమా పోస్టర్‌లతోనే హల్‌చల్ చేస్తోంది. ప్యాన్ ఇండియా స్టార్ హీరోగా తెరకెక్కిన ఈ చిత్రం ఈ నెల 16న ప్రేక్షకుల ముందుకు రానుంది. సినిమా ప్రమోషన్స్‌లో భాగంగా ఈ చిత్రం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఆరో తేదిన మంగళవారం తిరుపతి వేదికగా గ్రాండ్‌గా నిర్వహించడానికి నిర్మాణ సంస్థ ఏర్పాట్లు చేసింది. ప్రభాస్ సినిమా కావడంతో ఈవెంట్‌కు మరింత గ్రాండియర్ తీసుకురావడానికి ముఖ్య అతిథిగా ఎవరు హాజరవుతున్నారు అంటూ అభిమానుల్లో ఆసక్తి పెంచుతూ రెండ్రోజులుగా చిత్ర బృందం ఆసక్తికర పోస్ట్‌లు చేసింది. ఆ అతిథి ఎవరో తెలియజేస్తూ నిర్మాణ సంస్థ ట్వీట్ చేసింది. మంగళవారం తిరుపతిలో జరగనున్న ఆదిపురుష్ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు ప్రముఖ ఆధ్యాత్మికవేత్త చినజీయర్ స్వామి అతిథిగా హాజరుకానున్నారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ చిత్రబృందం ట్వీట్ చేసింది. శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ వేదికగా జరగనున్న ఈ కార్యక్రమానికి భారీగా ఏర్పాట్లు చేశారు. ప్రభాస్ అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొనబోతున్నారు. వేదికపైకి ప్రభాస్ ఎంట్రీ ప్రత్యేకంగా ప్లాన్ చేశారని తెలుస్తోంది. రామాయణం ఇతివృత్తంగా రూపొందుతున్న ఈ చిత్రంలో ప్రభాస్ రాముడిగా, కృతీసనన్ జానకిగా, లంకేశ్‌గా సైఫ్ అలీఖాన్ నటించారు. ఆధ్యాత్మికత ఉట్టిపడేలా ఈ వేడుక జరగనుందని తెలుస్తోంది. అందుకే చినజీయర్‌స్వామిని ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. ఈ వేడుకలో దాదాపు 200 మంది సింగర్స్, 200 మంది డ్యాన్సర్లు ప్రదర్శన ఇవ్వనున్నారు. ఓంరౌత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాకు సంగీతం అందించిన సంగీత దర్శకుల్లో ఒకరైన అతుల్ ముంబయి నుంచి తిరుపతికి బైక్‌పై రానున్నారు. ఆ అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా సినిమా ఉండనుందని ఇండస్ట్రీ వర్గాల టాక్. దాదాపు రూ. 600 కోట్ల భారీ బడ్జెట్ తో తెరకెక్కుతున్న ఈ సినిమాను బాలీవుడ్ డైరెక్టర్ ఓం రౌత్ తెరకెక్కించారు.



ప్రభాస్







# ఊపులో ఉన్న భోళా శంకర్

'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీసును దున్నేసిన చిరంజీవి ఈసారి 'భోళా శంకర్'గా అభిమానుల ముందుకొస్తున్నారు. స్టైలిష్ మేకర్ మెహర్ రమేష్ మాసివ్ యాక్షన్ ఎంట్టంల్గ÷నర్‌గా ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు. ఆగస్టు 11న 'భోళాశంకర్' ప్రేక్షకుల ముందుకు రానుంది. చిత్రబృందం ప్రచార కార్యక్రమాల్లో వేగం పెంచింది. 'భోళా శంకర్' నుంచి 'అదిరే స్టైల్ అయ్యా, పగిలే స్వాగ్ అయ్యా, యూఫోరియా నా ఏరియా, హే భోళా మానియా' అంటూ సాగే తొలి గీతాన్ని ఆదివారం చిత్రబృందం విడుదల చేసింది. రామజోగయ్య శాస్త్రి సాహిత్యం అందించిన ఈ గీతాన్ని మహతి స్వర సాగర్ స్వరపరిచారు. రేవంత్ ఎల్వీ ఆలపించారు. ఈ చిత్రంలో తమన్నా చిరంజీవికి జోడీగా నటిస్తున్నారు. కీర్తిసురేశ్ చిరుకు చెల్లెలుగా కనిపించనున్నారు. రామబ్రహ్మం సుంకర భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు.

# ప్రశాంత్‌నీల్‌కు ఎన్టీఆర్ బర్త్‌డే గిఫ్ట్

## నాటుకోడి పులుసు పంపిన ఎన్టీఆర్

'కేజీఎఫ్' సినిమాతో తిరుగులేని పాపులారిటీ తెచ్చుకున్న దర్శకుడు ప్రశాంత్ నీల్ తెలుగులోనూ ప్రభాస్‌తో సినిమాచేస్తున్నాడు. ఆదివారం ప్రశాంత్ నీల్ తన పుట్టిన రోజును ఘనంగా జరుపుకున్నాడు. ఆయన బర్త్ డే సందర్భంగా సోషల్ మీడియాలో విషెస్ వెల్లువెత్తాయి. ప్రశాంత్ నీల్ కోసం నాటుకోడి పులుసు పంపించిన తారక్.. ఫోటో వైరల్ అయ్యాయి.



అలాగే ప్రభాస్ సలార్ సెట్లో శనివారం అర్ధ రాత్రి ప్రశాంత్ పుట్టన రోజును ఘనంగా సెలబ్రేట్ చేశాడు. దానికి సంబంధించిన ఫోటోలు నెట్టింట తెగ వైరల్ అయ్యాయి. టాలీవుడ్ స్టార్లు రామ్ చరణ్, తారక్ లు కూడా సోషల్ మీడియా వేదికగా విషెస్ ను తెలియజేశారు. ఇక తారక్ ఏకంగా నాటు కోడి పులుసు పంపించి బర్త్ డే ట్రీట్ ఇచ్చాడు. ఈ విషయాన్ని ప్రశాంత్ నీల్ వైఫ్ లిఖిత రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో పోస్ట్ చేస్తూ.. థాంక్యూ అన్నయ్య అంటూ రాసుకొచ్చింది. ప్రస్తుతం ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. ఇక దేవర తర్వాత ఎన్టీఆర్.. ప్రశాంత్ నీల్ తో సినిమా చేస్తున్నాడు. ఇప్పటికే రిలీజైన ప్రీ లుక్ పోస్టర్ కు విశేష స్పందన వచ్చింది. రగ్గడ్ లుక్ లో ఎన్టీఆర్ ని చూసి నందమూరి అభిమానులు ఫుల్ ఖుషీ అయ్యారు. ప్రస్తుతం ప్రశాంత్ నీల్ ప్రభాస్ తో సలార్ సినిమా చేస్తున్నాడు. ఇది పూర్తి కాగానే తారక్ సినిమాను పట్టాలెక్కించనున్నాడు.



# చనిపోయిన దొంగ బయోపిక్ ఆ సినిమా!?

2019 సంవత్సరంలో తిరుచినాపల్లి జిల్లా లో ఉన్న లలితా జ్యూవెలరీ షో రూమ్‌లో దొంగతనం జరిగింది. తిరువరూర్ మురుగన్ అనే గజ దొంగ ఆ దొంగతనాని కి పాల్పడ్డాడు. ఏకంగా 13 కోట్ల రూపాయల విలువైన బంగారాన్ని మరియు వజ్రాల ను అతడు లూటీ చేయడం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశం అయిన విషయం తెల్సిందే. తమిళనాడు పోలీసులు చాలా కష్టపడి తిరువరూర్ మురుగన్ ను పట్టుకున్నారు. కేవలం ఆ ఒక్క దొంగతనం మాత్రమే కాకుండా తమిళనాడు లో ఇంకా పలు దొంగతనాలు మరియు ఏపీ.. తెలంగాణ రాష్ట్రాల్లో కూడా తన గ్యాంగ్ తో దొంగతనాల కు పాల్పడ్డ మురుగన్ ను అరెస్ట్ చేసిన పోలీసులు జైలు కు పంపించారు. అతడు 2020 సంవత్సరం లో ఎయిడ్స్ వ్యాధితో మృతి చెందాడు. ఇప్పుడు ఆ దొంగ కథను తీసుకుని తమిళంలో జపాన్ అనే సినిమా ను రూపొందిస్తున్నారు. షూటింగ్ ముగింపు దశకు చేరుకుంది.



కార్తీ హీరో గా అను ఇమాన్యూల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాకి రాజు మురుగన్ దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమా లో మురుగన్ కథ కు కాస్త కమర్షియల్ టచ్ ఇచ్చి స్క్రీన్ ప్లేను నడిపిస్తున్నట్లుగా తెలుస్తోంది. మురుగన్ ఎందుకు దొంగగా మారాడు.. ఆ తర్వాత ఎలా దొంగతనాలు చేశాడు అనేది కథ గా చూపించబోతున్నట్లు గా తెలుస్తోంది. ఈ సినిమా యొక్క క్లైమాక్స్ ను ఉన్నది ఉన్నట్లుగా చూపించాలని కొందరు యూనిట్ సభ్యులు.. అలా అక్కర్లేదు పాజిటివ్ గా క్లైమాక్స్ ఉంటే బాగుంటుందని కొందరు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. జపాన్ సినిమా లో దొంగ పాత్రను హీరో గా చూపించబోతున్నారు. కనుక హీరో ను ఎయిడ్స్ తో చంపడం ఏ మాత్రం కరెక్ట్ కాదని కొందరు అభిప్రాయం వ్యక్తం చేశారట. కార్తీ సూచన తో క్లైమాక్స్ సహజత్వంతో ఉండాలని ప్లాన్ చేశారట.

### అలనాటి బాలీవుడ్ నటి

# సులోచన కన్నుమూత

## సంతాపం తెలిపిన సినీ,రాజకీయ ప్రముఖులు

సినీ ఇండస్ట్రీలో విషాదం నెలకొంది. సీనియర్ నటి సులోచన లట్కర్ (94) మృతి చెందారు. అనారోగ్య కారణాలతో ముంబయి దాదర్‌లోని సుశ్రుసా ఆసుపత్రిలో చేరిన ఆమె ఆదివారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. 1928 జూలై 30న కర్ణాటకలోని ఖడక్లాత్‌లో జన్మించిన సులోచన లట్కర్ 1946లో సినీరంగంలోకి అడుగుపెట్టారు. 1959లో 'దిల్ దేకే దేఖో' చిత్రం ద్వారా బాలీవుడ్‌లో కూడా అరంగేట్రం చేశారు. 1995 వరకు అనేక సినిమాల్లో నటించారు. 'గోరా ఔర్ కాలా', 'సంపూర్ణ రామాయణం' 'జీవచా శాఖ' వంటి చిత్రాల్లో నటనకు పేరు సంపాదించారు. సులోచన ఎక్కువగా హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించారు. దాదాపు 250కి పైగా మరాఠీ చిత్రాల్లో కనిపించారు. 1960–70ల సమయంలో ఆమె పాపురల్ సినిమల్లో నటించారు. అలాగే స్టార్ హీరోహీరోయిన్‌లకు తల్లి పాత్రలో ఎక్కువ మెప్పించి నటిగా తనదైన ముద్రవేశారు. సినీ పరిశ్రమలో ఆమె చేసిన ?సవలకుగానూ పలు అవార్డులు అందుకున్నారు. 1999లో పద్మశ్రీ అవార్డు ఆమెను పద్మశ్రీ వరించింది. 2004లో ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డును అందుకున్నారు. ఆమె మరణం పట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. బిగ్‌బీ అమితాబ్ బచ్చన్ సులోచన మరణ వార్త భావోద్వేగానికి లోనయ్యారు. సినిమా ప్రపంచం మరో గొప్ప నటిని కోల్పోయింది. నేను నటించిన ఎన్నో గొప్ప చిత్రాల్లో లాలించే అమ్మగా నటించిన సీనియర్ నటి సులోచన మరణించడం బాధాకరం. ఈ మధ్యకాలంలో ఎప్పటికప్పుడు ఆమె ఆరోగ్య విషయాన్ని కుటుంబ సభ్యులు ద్వారా తెలుసుకుంటున్నా. ఈలోపే ఇలా జరిగింది. ఆమె పవిత్ర ఆత్మకుశాంతి చేకూరాలి అని అన్నారు. మరాఠీ, హిందీలో కలిపి 300 లకు పైగా సినిమాల్లో నటించారు. కటీపతంగ్, దిల్ దేకో దేఖో, గోరా ఔర్ కాలా.. వంటి ఎన్నో ఎవర్ గ్రీన్ మూవీస్ ఈ లిస్టులో ఉన్నాయి. కెరీర్ ప్రారంభంలో ఎక్కువగా మరాఠీ సినిమాలు చేసిన ఆమె.. తర్వాత హిందీ చిత్రసీమలోకి అడుగు పెట్టింది. ఈ సుదీర్ఘ ప్రయాణంలో సులోచన ప్రతిష్టాత్మక అవార్డులు కూడా అందుకుంది. సినిమా పరిశ్రమకు ఆమె చేసిన సేవలకు గాను.. 1999లో పద్మశ్రీ అవార్డు దక్కింది. 2009లో 'మహారాష్ట్ర భూషణ్' అవార్డు, లైఫ్ టైమ్ అచీవ్ మెంట్ అవార్డును కూడా అందుకుంది సులోచన. ఇక సులోచన లట్కర్ మృతి పట్ల ప్రధాని మోదీతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం తెలిపారు.



# మహాభారత్ సీరియల్ శకుని

## గుఫి పైంటాల్ కన్నుమూత



మహాభారత్ సీరియల్‌లో శకునిగా నటించిన నటుడు గుఫి పైంటాల్ (80) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. వారం రోజులుగా ఐసీయూలో ఉన్న గుఫి.. సోమవారం ఉదయం 9 గంటల ప్రాంతంలో తుదిశ్వాస విడిచారని సమాచారం. గుఫి మరణవార్త తెలుసుకున్న పలువురు బాలీవుడ్ ప్రముఖులు ఆయనకు సంతాపం తెలిపారు. 1975లో వచ్చిన రఫూ చక్కర్ అనే సినిమాతో బాలీవుడ్‌లో అడుగుపెట్టిన ఆయన.. ఆ తర్వాత దిల్లాగి, దేశ్ పరదేశ్, సుహాగ్ వంటి సూపర్ హిట్ చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్నాడు. గుఫీ సినిమాలతో పాటు పలు టీవీ షోలలో కూడా నటించాడు. బహదూర్ షా జఫర్, కానూన్, ఓం నమః శివాయ, సీఐడీ, కోయి హై ద్వారకాధీష్ భగవాన్ శ్రీ కృష్ణ, రాధాకృష్ణ, జే కనియాలాల్ షోలలో కనిపించాడు. ఇక మహాభారత్ సీరియల్‌లో ఆయన చేసిన శకుని పాత్ర ప్రేక్షకుల్లో ఆయనకు మంచి గుర్తింపును తీసుకొచ్చింది. 80 సంవత్సరాల వయసున్న గుఫి పైంటాల్ కు ఓ కొడుకు, కోడలితో పాటు ఓ మనవడు ఉన్నారు. జూన్ 5న సాయంత్రం 4 గంటలకు అంధేరి సబర్బన్‌లోని శ్మశానవాటికలో గుఫి అంత్యక్రియలు జరగనున్నాయి.



PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI SHARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206, PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE.
EDITOR : CH V. PRABHAKAR RAO, RNI T.C. TELTEL/2021/81092.
PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com